ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 24 మార్చి 2025
5

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:26 (సోమవారం సాయంత్రం)
సహర్: 4:47 (మంగళవారం ఉదయం)

రామయ్య కల్యాణానికి రండి

- సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన మంత్రులు
- నవమి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం, మంత్రులు

భద్రాచలం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న నిర్వహించనున్న శ్రీరామనవమి కల్యాణ మహోత్సవానికి వచ్చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రులు, రెవెన్యూ, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ ఈ. శ్రీధర్, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వైదిక సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, వేద ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను సీఎం, మంత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భద్రాద్రి ఆలయ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ ఎంతవరకు వచ్చిందని దేవాదాయశాఖ అధికారులను సీఎం అడిగారు. దాంతో ప్రస్తుతం చేపడుతున్న పనుల పురోగతిని వారు వివరించారు. అవసరమైన భూసేకరణ, నిధులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, భద్రాద్రి దేవస్థానం ఏఈవో శ్రవణ్‌కుమార్, స్థానాచార్యులు కేశ స్థలశాయి, ప్రధాన అర్చకుడు అమరవాది విజయరాఘవన్, వేదపండితుడు లింగాల రామకృష్ణప్రసాద్, రామాయణ పారాయణదారుడు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమా చార్యులు, అర్చకుడు అమరవాది కృష్ణమాచార్య శ్రీకాంత్ పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాన్‌వెస్లీ

భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజాపోరాటాలు

- ఉచిత విద్య, వైద్యం అందించడంలో పాలకులు విఫలం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

బోనకల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజాపోరాటాలను నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లి తెలిపారు. బోనకల్ మండలంలోని పెద్దబీరవల్లిలో ఆదివారం రాత్రి సీపీఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే ప్రాణాలర్పించిన గొప్ప యోధుడి (మిగతా 6వ పేజీలో)





ఆపద వేళ.. అడ్డగోలు దందా!

- ఇష్టారాజ్యంగా ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకుల వసూళ్లు
- వాటి నిర్వహణపై అజమాయిషీ లేని అధికారులు
- తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్న సామాన్యులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి23(ఆంధ్రజ్యోతి): ఇటీవల కొణిజర్లకు చెందిన ఓ మహిళకు ఓ ప్రమాదంలో తుంటి ఎముక విరిగింది. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా వైద్యుల సలహాతో హైదరాబాద్‌కు వెళ్లేందుకు ప్రైవేటు అంబులెన్స్‌ను ఆశ్రయించారు. కానీ సదరు నిర్వాహకుడు రూ.10 వేలు డిమాండ్ చేశాడు. అత్యవసరం కావడంతో చేసేదేమి లేక అడిగినంత చెల్లించి వెళ్లాల్సి వచ్చింది. ఖమ్మానికి చెందిన ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. అతడి తలకు ఎంఆర్ఐ తీయాలని వైద్యులు సూచించడంతో డయాగ్నస్టిక్ కేంద్రానికి వెళాల్సి వచ్చింది. అంబులెన్స్‌ను సంప్రదిస్తే నగరంలోనే కిలోమీటర్ కూడా లేని ప్రాంతానికి రూ.3వేలు డిమాండ్ చేశారు. వారు అడిగినంత ఇచ్చినా కూడా అక్కడ ఎంఆర్ఐ తీయడానికి కాస్త ఆలస్యం కావడంతో మరో రూ.వెయ్యి అదనంగా ఇవ్వాలంటూ సదరు అంబులెన్స్ నిర్వాహకుడు బాధితులతో వాదనకు దిగి మరీ వసూలు చేశాడు. ఇలా ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతూ ప్రజలను నిలువునా దోచుకుంటున్నారు. రోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా భారీగా దండుకుంటున్నారు. వాస్తవానికి దూరాన్ని బట్టి కిలోమీటరు లెక్కన డబ్బులు తీసుకోవాలి. కానీ ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. ఇంకొందరైతే కమీషన్ల కక్కుర్తితో బాధితులను నమ్మించి ఖమ్మం, వరంగల్, హైదరాబాద్‌లాంటి ప్రాంతాలకు తీసుకెళ్లాలంటే ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. అంతే కాదు అంబులెన్స్‌ల నిర్వాహకులు ఆస్పత్రి వారిచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి వారికిష్టమైన ప్రైవేటు ఆసుపత్రుల్లో చేర్పిస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో సుమారు 1500లకు పైగానే ప్రైవేటు అంబులెన్స్‌లు ఉన్నాయి.

ప్రభుత్వాసుపత్రుల ఎదుటే బేరాలు

ఒక్క ఖమ్మం నగరంలోనే 500లకు పైగా అంబులెన్స్‌లు ఉన్నాయంటే ఏ స్థాయిలో దందా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రథమ చికిత్సలే తప్ప సరైన వైద్యంలేక ఇతర ఆసుపత్రులకు వెళుతున్న రోగుల సంఖ్య అధికంగా ఉంటుంది. దీంతో ప్రభుత్వాసుపత్రుల ఎదుటే అంబులెన్స్‌లను పార్కింగ్ చేసి అత్యవసర చికిత్సలు అవసరమైన వారిని తరలించేందుకు రోగుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. 35-40 కిలోమీటర్ల దూరం వరకు సాధారణ రోగిని తీసుకెళితే రూ.3,500నుంచి రూ.5వేలు, ఆక్సిజన్ పెడితే అదనంగా చెల్లించాల్సి ఉంటుందని రోగులు వాపోతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు చేర్చితే ఆస్పత్రి యాజమాన్యాలకు రోగి చెల్లించే బిల్లులో కమీషన్‌గా సగటున 10 నుంచి 20 శాతం ముట్టజెబుతున్నట్లు సమాచారం.

సరైన పత్రాలు లేకుండా..

ప్రభుత్వ నిబంధనల మేరకు అంబులెన్స్ వాహనాల్లో ప్రథమ చికిత్స కిట్టు.. ఫిట్‌నెస్, ట్యాక్సీ, పొల్యూషన్, బీమా పత్రాలతోపాటు డ్రైవర్కు బ్యాడ్జీ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. వాహనంలో ఆక్సిజన్ సిలిండర్, మాస్కు ఉండాలి. అయితే కొన్నింటిలో ఇవేవీ లేకుండానే నడిపిస్తున్నట్లు తెలిసింది. అత్యవసర సేవలు కావడంతో అధికారులు వీటిని తనిఖీ చేయడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఖమ్మానికి చెందిన ఎ అంబులెన్స్ రోగిని తీసుకుని హైదరాబాద్ వెళ్తుండగా సూర్యాపేట సమీపంలో ప్రమాదానికి గురైంది. అధికారులు తనిఖీలు చేయగా ఆ అంబులెన్స్‌కు కనీసం ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో విస్మయాన్ని వ్యక్తం చేశారు.

అజమాయిషీ ఎవరిది ?

ప్రైవేటు అంబులెన్స్‌లపై అజమాయిషీ ఎవరిదనే విషయంపై శాఖల మధ్య సమన్వయమే లేకుండా పోయింది. ఉమ్మడి జిల్లాలో కనీసం 1,500 వరకు ప్రైవేటు అంబులెన్స్‌లు ఉన్నట్లు సమాచారం. అయితే వీటిని ఆర్టీఏ అధికారులే నిబంధనల ప్రకారం అనుమతులు ఇస్తారని వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ అనుమతి లేని అంబులెన్స్‌లపై ఆర్టీఏ, వైద్యశాఖ ఎవరికి ఫిర్యాదు చేయాలనే విషయంపై స్పష్టత లేదు. ఖమ్మం జిల్లా వైద్యారోగ్యశాఖఅధికారి డాక్టర్ కళావతిబాయి మాత్రం ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకులు రోగులు వారి బంధువులను ఇబ్బందిపెడితే తమకు ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.

నేడు ఆంధ్రజ్యోతి లక్కీడ్రా

- ఖమ్మం యూనిట్ కార్యాలయంలో కార్యక్రమం

ఖమ్మం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): 'మా అక్షరమే మీ ఆయుధం'గా సాగుతూ పాఠకుల మన్ననలు పొందుతున్న 'ఆంధ్రజ్యోతి' దిన పత్రిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కూపన్ల లక్కీ డ్రా సోమవారం ఖమ్మం యూనిట్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. 2002 అక్టోబరు 15న పునఃప్రారంభమై ప్రజలముందుకు వచ్చిన 'ఆంధ్రజ్యోతి' పత్రిక 22ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా పాఠకులకు బహుమతులు అందించేందుకు జిల్లాస్థాయిలో లక్కీడ్రా నిర్వహించనుంది. ఖమ్మంలోని ఇండస్ట్రియల్ ఏరియాలోని 'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 1గంటకు లక్కీడ్రా నిర్వహించనున్నారు. యూనిట్‌స్థాయిలో మొదటి బహుమతి కింద మోటారుబైక్, రెండో బహుమతి కింద రిఫ్రిజిరేటర్, మూడో బహుమతి కింద టీవీ ఇవ్వనున్నారు. విజేత ఎంపిక కోసం పాఠకుకల నుంచి వచ్చిన కూపన్ల నుంచి డ్రా తీయనున్నారు. వీటితోపాటు పలువురికి కన్సోలేషన్ బహుమతులు కూడా అందించనున్నారు. ఇప్పటికే పాఠకులు 'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా కూపన్లను ఖమ్మం యూనిట్ కార్యాలయానికి పంపించారు. పాఠకులనుంచి వచ్చిన కూపన్లన్నింటినీ కలిపిన తర్వాత డ్రా తీయనున్నారు.

విలీన ప్రాంత సమస్యల పరిష్కారం దిశగా..

- రూ.102.82 కోట్లతో కార్పొరేషన్ బడ్జెట్
- మూడేళ్లలో గణనీయంగా పెరిగిన ఆదాయ, వ్యయం
- రేపు ఖమ్మం నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశం

7



సింగరేణి ఉపరితల గని కార్యాలయాల సముదాయం

సింగరేణి పురిటిగడ్డకు పెనుసవాళ్లు

6

- మూసివేతకు సిద్ధమైన జేకే-5 ఓసీ
- క్లియరెన్స్‌లు రాని పూసపల్లి విస్తరణ ప్రాజెక్టు



మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్

ఆరోగ్యమే మహాభాగ్యం

6

- కొత్తగూడెం క్లబ్‌లో ఆరోగ్య మహాసభ
- పాల్గొన్న భద్రాద్రి కలెక్టర్ జితేష్



అవార్డు అందుకుంటున్న డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

క్షయ నివారణలో భద్రాద్రి భేష్

- టీబీ సేవల్లో రాష్ట్రస్థాయిలో భద్రాద్రి జిల్లాకు రెండోస్థానం
- డీఎంహెచ్‌వోకు అవార్డు అందించిన రీజినల్ హెల్త్ డైరెక్టర్ అనురాధ

చుంచుపల్లి, మార్చి23(ఆంధ్రజ్యోతి): క్షయ నివారణకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చేస్తున్న సేవలకు గుర్తింపు లభించింది. జిల్లా టీబీ(క్షయ) విభాగంలో అందించిన సేవలకుగాను రాష్ట్రస్థాయిలో ఈ జిల్లా రెండోస్థానం సాధించింది. 2024 ఏడాదికి సంబంధించి రెండో బహుమతిని హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ, రాష్ట్ర క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రాజేశం చేతులమీదుగా స్వీకరించినట్లు ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ తెలిపారు. జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ బాలాజీనాయక్‌తో కలిసి అవార్డుతో పాటు, ప్రశంసాపత్రం అందుకున్నట్లు తెలిపారు.

నవమి రోజు భద్రాద్రి మాడవీధుల పనులకు శ్రీకారం

- మూడు రోజుల్లో స్థల సేకరణ పనులు పూర్తి చేస్తాం
- రాబోయే నాలుగేళ్లలో 20లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యం
- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- శ్రీరామ నవమి ఏర్పాట్లపై భద్రాచలంలో సమీక్ష

భద్రాచలం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని మాడవీధుల విస్తరణ పనులకు శ్రీరామనవమి రోజైన ఏప్రిల్ 6న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదగా శ్రీకారం చుడతామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మూడు రోజుల్లో మాడవీధులకు సంబంధించి స్థల సేకరణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. భద్రాచలంలో ఆదివారం శ్రీరామనవమి ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 6న శ్రీరామనవమి, 7న జరిగే మహాపట్టాభిషేకాన్ని తిలకించటానికి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వశాఖల అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఎండల తీవ్రత ఈ ఏడాది అధికంగా ఉన్నందున భక్తులకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎటువంటి



గృహ సముదాయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. వైద్యశాఖ సిబ్బంది అవసరమైన మందులు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని, అవసరమైతే ఇతర జిల్లాల నుంచి సిబ్బందిని, అంబులెన్స్‌లను అదనంగా తీసుకోవాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే అనుభవజ్ఞులైన సీపీఆర్ నిపుణులను తీసుకోవాలన్నారు. ఈ క్రమంలో నవమి ఏర్పాట్లను మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో బి. రాహుల్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, భద్రాచలం ఆర్డీవో దామోదరరావుతో కలిసి పరిశీలించారు.

సొంతింటి కల నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం

పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాచలంలో 117ఇళ్లను ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. 2004నుంచి 2014వరకు 25లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత దశాబ్ద కాలంగా రాష్ట్రంలో 1,56,000 ఇళ్లు అసంపూర్తిగా వదిలివేయగా తమ ప్రభుత్వం వచ్చిన అనంతరం 96 వేల ఇళ్లు పూర్తి చేసి అర్హులకు అందిచామన్నారు. మిగిలిన ఇళ్లను సైతం యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు నిర్మించేలా పైలట్ ప్రాజెక్టు తీసుకున్నామన్నారు. ఇందుకోసం సీఎం రేవంత్ రూ.380కోట్లు మంజూరు చేశారని, రాబోయే నాలుగేళ్లలో 20లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

తడి, పొడి చెత్త సేకరణ కేంద్రం ప్రారంభం..

భద్రాచలంలోని సుందరయ్యనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన తడి, పొడి చెత్త వనరుల సేకరణ కేంద్రాన్ని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు రూ.1.40కోట్ల అంచనా వ్యయంతో పంచాయతీ సాధారణ నిధుల నుంచి ఈ కేంద్రాన్ని నిర్మించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుతో పాటు ఎంపీ పోరిక బలరాంనాయక్, కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో, పంచాయతీ ప్రత్యేక అధికారి బి.రాహుల్ పాల్గొన్నారు.

గిరిజన మ్యూజియం సందర్శన

గిరిజన మ్యూజియాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. ఇటీవల మ్యూజియం అభివృద్ధికి చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. నవమి రోజు సీఎం రేవంత్ చేతుల మీదగా మ్యూజియంను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తామన్నారు. చివరగా మ్యూజియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌లో మంత్రి ఫొటో దిగారు.



సెల్ఫీ పాయింట్‌లో ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీ

ముఖాముఖి



లబ్ధిదారుల ఎంపికకు మరోమారు పరిశీలన

శ్రీనివాస్, గృహ నిర్మాణ సంస్థ ఖమ్మం జిల్లా పీడీ

ప్రశ్న: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తైందా?

జ: జనవరి 26న ఎంపిక చేసిన గ్రామాల్లో 20 గ్రామాల్లోనూ 850 మంది లబ్ధిదారులను ఎంపిక చేశాం. ఆయా గ్రామాల్లో ఎంపీడీవోలు ఇచ్చిన జాబితాల ఆధారంగా గ్రామసభల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశాం.

ప్ర: పట్టణ ప్రాంతాల్లో ఎంపిక ప్రక్రియ పరిస్థితి ఏంటి?

జ: ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మధిర, సత్తుపల్లి, వైరా మునిసిపాలిటీల్లో ఎల్1 (జాబితా 1) ఆధారంగా లబ్ధిదారులను గుర్తించాం. వాటికి సంబంధించి ఇప్పటికే ఒక దశలో పరిశీలన పూర్తి చేశాం. అయితే మరో మారు లబ్ధిదారుల ఎంపికకు నగరాలు, పట్టణాల్లో రీ వెరిఫికేషన్‌ను చేస్తున్నాం.

ప్ర: పట్టణాల్లో లబ్ధిదారుల ఎంపిక ఎప్పటికి పూర్తవుతుంది?

జ: ఇప్పటి వరకు ఖమ్మం కార్పొరేషన్‌లో 5,754, మధిరలో 1,211, వైరాలో 2,201, సత్తుపల్లిలో 856 మంది లబ్ధిదారులను గుర్తించాం. వీటిలో మళ్లీ లబ్ధిదారుల ఎంపిక కోసం రీ వెరిఫికేషన్ చేస్తున్నాం. పూర్తవ్వగానే లబ్ధిదారులను వార్డు సభల ద్వారా ఎంపిక చేస్తాం.

ప్ర: ప్రత్యేక గ్రామాల్లో ఇళ్లను మంజూరు చేశారా?

జ: 20 మండలాల్లో కూసుమంచి మండలం ధర్మాతండా, ఖమ్మం రూరల్‌లో ఆరెంపుల, నేలకొండపల్లిలో కొంగర, తిరుమలాయపాలెంలో ఏలువారిగూడెం, రఘునాథపాలెంలో మల్లెపల్లి, బోనకల్‌లో గార్లపాడు, ఎర్రుపాలెంలో రాజులదేవరపాడు, చింతకానిలో రేపల్లెవాడ, మధిరలో చిల్కూరు,ముదిగొండలో ఖానాపురం, ఏన్కూరులో రేపల్లెవాడ, వైరాలో పుణ్యపురం, కొణిజర్లలో చిన్నగోపతి, సింగరేణిలో కొత్తతండా, కామేపల్లిలో పొన్నెకల్, వేంసూరులో చిన్నమల్లెల, పెనుబల్లిలో రామచంద్రాపురం, కల్లూరులో ఈస్ట్ లోకవరం, సత్తుపల్లిలో కొత్తూరు, తల్లాడలో కొడవిమిట్ట గ్రామాల్లో 850 మంది లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది.

ప్ర: నిర్మాణాలకు ఎప్పుడు శంకుస్థాపన చేస్తున్నారు ?

జ: ఇప్పటి వరకు 405 ఇళ్లకు కలెక్టర్ లాగిన్ నుంచి గ్రౌండ్ చేశాం. వీటిలో 48 ఇళ్లు బేస్‌మెట్ లెవల్‌కు వచ్చాయి. త్వరలో మంజూరు అయిన వాటిని గ్రౌండింగ్ చేయనున్నాం.

ప్ర: లబ్ధిదారులకు డబ్బుల చెల్లింపులు ఎలా చేస్తున్నారు ?

జ: నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ముందు మంజూరు అవుతాయి. వీటిల్లోనే పట్టణాలు, గ్రామాల్లో ఎంపిక జరుగుతున్నాయి. లబ్ధిదారులకు బేస్‌మెంట్ స్థాయిలో లక్ష, రూఫ్ లెవల్‌లో లక్ష, స్లాబ్ పూర్తయ్యాక 2 లక్షలు, భవనం ఫినిషింగ్ వర్క్‌తో సహా పూర్తయిన తర్వాత మరో లక్ష మొత్తం రూ.5లక్షలను నేరుగా లబ్ధిదారుని ఖాతాల్లోనే జమ చేస్తున్నాం.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్



పుట్టిన రోజు జేజేలు.. చిట్టి తాతయ్యకు..

కేక్ కటింగ్ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే

- వెంకటసీతారామచంద్రరాజు 105 ఏళ్ల సంబురం
- శతాధిక వృద్ధుడికి వైభవంగా వసంతోత్సవం
- హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు
- వెల్లివిరిసిన కుటుంబ ప్రేమాభిమానాలు

దుమ్ముగూడెం మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శతాధిక వృద్ధుడి వసంతోత్సవాలు ఆదివారం గంగోలు గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సరిహద్దు చర్ల మండలం గోగుబాకకు చెందిన సాగి వెంకటసీతారామచంద్రరాజు 105 ఏళ్ల వయస్సులోనే ఆరోగ్యంగా ఉండడం విశేషం. ఆదివారం ఆయన జన్మదిన వేడుకలను వసంతోత్సవంగా ఘనంగా నిర్వహించారు. 1920లో జన్మించిన రాజు అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం చింతలపల్లి నుంచి ఎనభై ఏళ్ల క్రితం గోగుబాక వ్యవసాయం కోసం వచ్చారు. వీరికి ఇద్దరు మగ, ఇద్దరు ఆడ సంతానం కాగా కొడుకులు, కూతుర్లు మనవళ్లు, మునిమనవళ్లు కలిపి 42 మంది సంతానం. భార్య వెంకటలక్ష్మి నర్సాయమ్మ 15 ఏళ్ల క్రితమే చనిపోయారు.

నిండైన ఆరోగ్యం...

ఇప్పటికీ రోజుకు సుమారు పది చుట్టలు తాగుతూ, మసాలా బాగా దట్టించిన మాంసాహార వంటలు తింటూ బీపీ, షుగర్‌లాంటివి లేకుండా ఆరోగ్యంగా తిరుగుతుండడం గమనార్హం. కరోనాలోనూ ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తలేదు. నిత్యం ఉదయం పూట రెండు కిలోమీటర్లు నడిచే అలవాటున్న ఈ పెద్దమనిషి కళ్లజోడు లేకుండా వార్తపత్రికలు చదువుతారు. పక్కా సీపీఐ నేపథ్యం ఉన్న సీతారామచంద్రరాజు కేవలం రెండు సందర్భాల్లో మాత్రమే పొత్తులో ఉన్న పార్టీలకు ఓటేశారు. తెలుగుదేశం అసెంబ్లీ అభ్యర్థి కొమరం ఫణీశ్వరమ్మ, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టరు తెల్లం వెంకట్రావుకు మాత్రమే ఓటేయడం విశేషం. ఉదయం ఒక టీ, మధ్యాహ్నం నాన్‌వెజ్‌తో కూడిన భోజనం, సాయంత్రం ఏడులోపు భోజనం ముగించి పడుకోవడం నిత్యకృత్యం.

ప్రేమతో మునువడు..

పేకాట ప్రియుడైన తాతయ్య ఏ చిన్న అవకాశం దొరికినా ఆడకుండా ఉండరని మనవడు వెంకట జగన్నాథరాజు(నానీ బాబు) తెలిపారు. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, రెండు మండలాలకు చెందిన వందలాది మంది రైతుల నడుమ పురోహితులు ఆశీర్వచనం పలికారు. తల్లిదండ్రులను కూడా అంతంత మాత్రమే చూస్తున్న ప్రస్తుత కాలంలో సుమారు రూ.3లక్షలు ఖర్చు పెట్టి మనవడు నానీ బాబు వేడుక నిర్వహించడం కుటుంబ విలువలను కాపాడడం, పెద్దల ఎడల ప్రేమాభిమానాల ప్రదర్శనకు తార్కాణమని చెప్పుకోవచ్చు.



శతాధిక వృద్ధుడు రామచంద్రరాజు

ఘనంగా శతాధిక వృద్ధుడి వేడుకలు

గంగోలులో ఆదివారం శతాధిక వృద్ధుడు సాగి వెంకటసీతారామచంద్రరాజు వసంతోతవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టరు తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు హాజరై కేక్ కట్ చేయించారు. మంచి అలవాట్లతో ఆరోగ్యంగా జీవించవచ్చని వారు అన్నారు. పురోహితులు దీవించి ఆశీర్వచనం పలికారు. భద్రాచలం మార్కెటు కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, టీడీపీ నాయకురాలు కొమరం ఫణీశ్వరమ్మ, నాయకులు అన్నె సత్యనారాయణమూర్తి, కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.



కొంగల చెరువులో చేపలు పడుతున్న వివిధ గ్రామాల ప్రజలు

కొంగల చెరువులో.. జల పుష్పాల వేట

- చేపల వేటకు భారీగా తరలిన గ్రామస్థులు
- ఏటా వేసవిలో నీరు తగ్గేవేళ చెరువుల్లో జనజాతర
- ఆసక్తి చూపుతున్న మత్స్య ప్రియులు

కరకగూడెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కరకగూడెం మండలంలోని చిరుమళ్ల పంచాయతీ కొంగల చెరువులో ఆదివారం జనసందడి కనిపించింది. అనంతారం, పద్మాపురం, కరకగూడెం, తాటిగూడెం, చిరుమళ్ల, పోలకమ్మతోగు, రాయణపేట, కౌలూరు, గొళ్లగూడెం, కొత్తగూడెం, కొత్తూరు, చొప్పాల, రంగాపురం, వీరాపురం, దేమరతోగు గ్రామాలతో పాటు పరిసర ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో చేపలు పట్టేందుకు కొంగల చెరువుకు వచ్చారు. దీంతో మత్స్యజాతరను తలపించింది. కరకగూడెం మండలం పూర్తి ఏజెన్సీ ప్రాంతం అవడం.. వ్యవసాయ భూములు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ పలు గ్రామాలలో పదుల సంఖ్యలో పలు చెరువులు ఉన్నాయి. ఇక్కడ చెరువులలో నీరు తగ్గుతుండటంతో ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలలో చేపలు పడుతుంటారు. చేపలు పట్టే రోజున ఆయా గ్రామాల ప్రజలు ఆ చెరువులో చేపలను పట్టేందుకు ఆటోలు, బైక్‌లు, కాలినడక అక్కడకు చేరుకుంటారు. ఆదివారం కొంగల చెరువులో చేపలను పట్టేందుకు పలు గ్రామాల నుంచి ఇక్కడకు ప్రజలు రావడంతో జనజాతరగా కనిపించింది.

నేడు, రేపు కేవీకేలో 'వ్యవసాయ సమావేశం'

వైరా, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వైరాలోని కృషి విజ్ఞానకేంద్రంలో సోమ, మంగళవారాల్లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మధ్యతెలంగాణ మండలం(ఉమ్మడి వరంగల్, ఖమ్మం, మెదక్‌జిల్లాల) పరిధిలో వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశం జరుగుతుందని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ తెలిపారు. ఈ రెండురోజులు జరిగే సమావేశాల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, అభ్యుదయ రైతులు సలహా సంఘ సభ్యులుగా పాల్గొంటారని తెలిపారు. వ్యవసాయ పరిశోధన, విస్తరణ విభాగాల్లో ఈ ఏడాది చేపట్టే కార్యక్రమాలు అలాగే రానున్న వ్యవసాయ సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్, రబీ పంటల్లో చేపట్టాల్సిన పరిశోధన, విస్తరణ, ప్రత్యామ్నాయ, ఆపతికాల ప్రణాళికల గురించి చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని వివరించారు.

ఈ సారి నవమికి రాతి రంగులు

- కల్యాణ మండపం, స్వాగత ద్వారాలకు కొత్త శోభ



కల్యాణ మండపానికి రంగు వేస్తున్న దృశ్యం

భద్రాచలం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపం, మిథిలా ద్వారం, స్వాగత ద్వారాలకు రాతిని పోలిన రంగుతో పాటు కంచు రంగును వేస్తున్నారు. గత కొన్నేళ్లుగా పంచ రంగులను వీటికి వేస్తుండగా ఈ సారి రాతి రంగును వేస్తున్నారు. పర్ణశాలలో సైతం ఇదే మాదిరిగా రాతి రంగునే వేశారు. ఈ రంగులు వేయటానికి భద్రాచలంలో రూ.9.90 లక్షలు, పర్ణశాలలో రూ.9.70 లక్షలు వెచ్చిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులు భద్రాచలంలో కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా డిసెంబరు, జనవరిలో నిర్వహించిన వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలను పురస్కరించుకుని ఉత్తర ద్వారానికి సైతం రాతి రంగులనే వినియోగించారు.

సింగరేణి పురిటిగడ్డకు పెనుసవాళ్లు

- మూసివేతకు సిద్ధమైన జేకే-5 ఓసీ
- క్లియరెన్స్‌లు లభించని పూసపల్లి విస్తరణ ప్రాజెక్టు
- కార్మిక కుటుంబాల్లో బదిలీల బెంగ
- బొగ్గుట్టలో కొనఊపిరితో సింగరేణి ఉనికి

ఇల్లెందు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నల్లబంగారానికి జన్మనిచ్చిన పురిటిగడ్డలో సింగరేణి కాలరీస్ ఉనికి మినుకు మినుకుమంటోంది. బొగ్గు నిల్వలు పూర్తి కావడం, అరకొరగా మిగిలిన కోల్‌బెంచీల్లో ప్రమాదాలు పొంచి ఉండటం, మైనింగ్ సేఫ్టీ నిబంధనల మూలంగా ఇల్లెందులోని జేకే-5 ఓసీని కొనసాగించడం అసాధ్యంగా మారడం, పూసపల్లి ఓపెన్‌కాస్టు విస్తరణల్లో పూర్తిస్థాయిలో అనుమతులు రాకపోవడంతో ఇల్లెందులో సింగరేణి ఉనికి ప్రశార్థకంగా మారింది.

ఇల్లెందు ఏరియా సింగరేణి పరిధిలో జేకే-5 ఓపెన్‌కాస్టుతో పాటు టేకులపల్లి మండలం కోయగూడెం ఓపెన్‌కాస్టు గనుల్లోనే ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తులు సాగుతున్నాయి. అయితే ఇల్లెందులో కొనసాగుతున్న జేకే-5 ఓసీ మార్చి 31 తరువాత మూసివేసేందుకు సన్నాహాలు జరుగుతుండటంతో ఆ గనిలో పనిచేస్తున్న 214మంది కార్మికులు 18 మంది అధికారుల్లో బదిలీల బెంగ వెంటాడుతోంది.

ఇల్లెందు జేకే ఓసీ కనుమరుగేనా ?

గత 13 సంవత్సరాలుగా బొగ్గు ఉత్పత్తులు సాగిస్తున్న ఇల్లెందు జేకే-5లో బొగ్గు నిల్వలు దాదాపు పూర్తి కావడం అక్కడక్కడా కొన్ని కోల్ బెంచీలు ఉన్నా అవి ప్రమాదకరంగా మారిన జియోలాజికల్ కండీషన్ల మూలంగా వాటిల్లో బొగ్గు ఉత్పత్తి చేయడం సాధ్యం కాక ఈ గనిని మూసివేయాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది. నూతనంగా చేపట్టిన పూసపల్లి విస్తరణకు సంబంధించి ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ డైరక్టర్ ఆఫ్ మైనింగ్ సేఫ్టీ నుంచి వర్కింగ్ కండీషన్లపై ఇంకా అనుమతులు రావాల్సి ఉంది. అందుకు మూడు నాలుగు నెలల సమయం పట్టే అవకాశాలు ఉండటం, పాత ఓసీని మూనివేయాల్సి రావడంతో కార్మిక కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. అయితే పూసపల్లి విస్తరణ ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించి వివిధ పనులకు కొందరు కార్మికులను సర్దుబాటు చేసే అవకాశాలు ఉన్నా ఆపరేటర్లు, జనరల్ మజ్దూర్లకు బదిలీలు అనివార్యంగా మారాయి.

జేకే-5 ఓసీలో పొంచి ఉన్న ప్రమాదాలు

మూసివేతకు సిద్ధమైన జేకే-5 ఓసీ బొగ్గు గనిని పూసపల్లి విస్తరణ ప్రాజెక్టు ప్రారంభం అయ్యేవరకు కొనసాగించడం వల్ల కార్మికులను సర్దుబాటు చేయవచ్చని వివిధ కార్మిక సంఘాలు కోరుతున్నా జేకే-5 ఓసీని కొనసాగించడం అత్యంత ప్రమాదకరమని సింగరేణి మైనింగ్ అధికారులు పేర్కొంటున్నారు. నిజానికి గత కొన్ని సంవత్సరాలుగా జేకే-5 ఓసీని ఇప్పటివరకు సింగరేణి అధికారులు దినదిన గడంగానే నడిపారనే చెప్పవచ్చు. 2021 ఆగస్టు నెలలో, 2022జూన్‌నెలలో మైనింగ్ సేఫ్టీవిభాగం అధికారులు నిర్వహించిన తనిఖీల్లో బలహీనంగా ఉన్న స్లైడింగ్ ఏరియాల్లో పనులు చేయవద్దని ఆ ఏరియాల్లో బొగ్గు వెలికితీత పనులు నిలిపివేయాలని ఆదేశించినట్టు సమాచారం. భూమి పొరలు పైనుంచి కూలుతుండటం, స్లైడింగ్‌ల కారణంగా బెంచీలు కూలితే భారీగా ప్రాణనష్టం జరుగుతుందని, మిషన్లు కూడా వెలికి తీయడం సాధ్యం కాదని సేఫ్టీ అధికారులు హెచ్చరికలు చేశారు. వివిధ రకాల ఒత్తిళ్లతో జేకే-5 ఓసీ జీవితకాలం పెంచుకుంటూ పోతున్నారని, ఇప్పటికే నాలుగు మిలియన్ టన్నుల బొగ్గు నిబంధనలకు విరుద్ధంగా వెలికి తీసినట్లు సమాచారం. 2022 వరకే జేకే ఓసీలో బొగ్గు తవ్వకాలు జరపడానికి అనుమతులు ఉన్నాయి. స్లైడింగ్ జరుగుతున్న ఏరియాల్లో 50 మీటర్ల మేర ప్రమాదకర బెంచ్‌ల చుట్టూ పెన్సింగ్‌లు వేయాలని డీజీఎంఎస్ అధికారులు గతంలోనే ఆదేశాలుజారీ చేశారు. అయినా బొగ్గు తవ్వకాలు కొనసాగించారు. ఈ కాలంలో గనిలో ప్రమాదకర సంఘటనలు, ప్రాణనష్టాలు, యాంత్రికనష్టాలు జరిగి ఉంటే సింగరేణి మైనింగ్ అధికారులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చేదని వ్యక్తిగతంగా అధికారులు క్రిమినల్ కేసులకు సైతం గురికావాల్సి వచ్చేదని తెల్సింది. అదృష్టవశాత్తు రెండున్నర ఏళ్ల కాలంలో ఓసీలో ఎలాంటి ప్రమాదాలు ఉత్పన్నం కాలేదని అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. సవాళ్లతో కూడిన జేకే ఓసీని ఇంకా కొనసాగించాలని అధికారులపై ఒత్తిళ్లు జరుగుతుండటంతో సింగరేణి యాజమాన్యం పాలుపోని రీతిలో కొట్టుమిట్టాడుతోంది.

పదమూడేళ్ల కాలంలో రికార్డుస్థాయి ఉత్పత్తులు

ఇల్లెందు ఏరియా జే కే-5 ప్రాజెక్టు 2012 నుంచి ప్రారంభమైంది. గడిచిన 13 ఏళ్లుగా లక్ష్యాలను మించి బొగ్గు ఉత్పత్తులను సాధించింది. తొలుత జేకే-5 ఓసీ జీవిత కాలంలో ప్రాజెక్టు నుంచి 23.67 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి వెలికి తీయడం లక్ష్యం కాగా 2012 నుంచి 2025 వరకు లక్ష్యాలను మించి 27.9మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేశారు. ఓసీ లక్ష్యాన్ని అధిగమించి నాలుగు మిలియన్ బొగ్గు ఉత్పత్తి చేయడం గమనార్హం, పూసపల్లి ఏరియాలో జేకే 5 ఓసీ విస్తరణ పనులు ఉపరితలంలో ప్రారంభించినా ఓవర్ బర్డెన్ తొలగింపు, బొగ్గు ఉత్పత్తి పనులు చేపట్టడానికి పూర్తిస్థాయి క్లియరెన్స్‌లు లభించాల్సి ఉంది. అయితే అన్ని రకాల క్లియరెన్స్‌లు లభించి పూసపల్లి ప్రాజెక్టులో బొగ్గు ఉత్పత్తులు ప్రారంభంకావడానికి మూడు నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉండటంతో పనిచేస్తున్న కార్మికులను ఉద్యోగులను ఎక్కడ, ఎలా సర్దుబాటు చేస్తారోనన్న ఊహాగానాలు జోరందుకున్నాయి.

ఆరోగ్యమే మహాభాగ్యం

- కొత్తగూడెం క్లబ్‌లో ఆరోగ్య మహాసభ
- పాల్గొన్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ప్రజాకవి జయరాజు



విద్యార్థినులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహా భాగ్యమని, ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల, ఆహారపు అలవాట్లు పట్ల జాగ్రత్తలు పాటించాలని, అందుకు ప్రకృతే సర్వ మానవాళికి జీవనాధారమని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కొత్తగూడెం క్లబ్‌వేదికగా ఆదివారం నిర్వహించిన ఆరోగ్య మహాసభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న సమాజంలో ఆహారపు అలవాట్లు పర్యావరణ పరిరక్షణకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. వాటిని సరిదిద్దుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రస్తుతం ఉన్న రోగాల్లో 95శాతానికి పైగా మనం సృష్టించుకున్నవే ఉన్నాయన్నారు. వాటిని అదుపు చేసుకునే అవకాశాలు కూడా ప్రకృతి మనకు ప్రసాదించిందని గుర్తు చేశారు. అందరూ తమ ఆహారం, ఆరోగ్య బాధ్యతలను గుర్తు చేసేందుకు ఇలాంటి ఆరోగ్య మహాసభలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరు తమకు తోచిన విలువైన ఆరోగ్య సలహాలు సూచనలు తోటివారికి అందిస్తూ ఆరోగ్యకరమైన సమాజం నిర్మించేందుకు బాధ్యతగా ముందడుగు వేయాలని తెలిపారు. సభలో ప్రముఖ వ్యక్తివికాస నిపుణులు, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ప్రజాకవి జయరాజు మాట్లాడారు. కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షుడు సంఘం వెంకటపుల్లయ్య, ప్రకృతి ప్రేమికులు మొక్కల వెంకటయ్య, డాక్టర్ బి.కృష్ణయ్య, బాలశౌరీ, కమలారాణి, పూర్ణచందర్‌రావు, శశికుమార్, డాక్టర్ ఉపేందర్‌రావు, గోనె శ్రీకాంత్, కోనేరు పూర్ణచందర్‌రావు, ప్రకృతి ఆశ్రమ కో-ఆర్డినేటర్ గోరింట్ల సుగుణారావు, మేరెడ్డి వసంత తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజాపోరాటాలు

(5వ పేజీ తరువాయి)

ఆశయాలు చిరస్మరణీయమన్నారు. దేశ సంపద పేద ప్రజలకు అందించాలన్న భగత్‌సింగ్ ఆలోచనలకు అనుగుణంగా ఎర్రజెండా పోరాటాలను నిర్వహిస్తోందన్నారు. పేదలకు ఉచితంగా విద్య, వైద్యం అందించడంలో పాలకవర్గాలు విఫలమయ్యాయని విమర్శించారు. బీజేపీ మతోన్మాదంతో దేశంలో ఘర్షణలు సృష్టిస్తోందని, కార్పొరేట్ వర్గాలకు కొమ్ము కాస్తోందన్నారు. అన్ని వ్యవస్థల్లో అసమానతలు పెరిగిపోతున్నాయని వాపోయారు. పరిపాలన చేతకాకపోతే ఎర్రజెండాకు అప్పగిస్తే చేసి చూపిస్తామని సవాల్ విసిరారు. అనంతరం జాన్‌వెస్లీని సీపీఎం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, బుర్రి ప్రసాద్, జిల్లా, డివిజన్ కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, మడిపల్లి గోపాలరావు, నాయకులు బండి రమేష్, బొంతు రాంబాబు, బుగ్గవీటి సరళ, యనమద్ది సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



నేలకొరిగిన మొక్కజొన్నను చూపిస్తున్న రైతు రమేష్

నేలవాలుతున్న ఆశలు..

- ఈదురుగాలులతో నేలకొరిగిన మొక్కజొన్న పంట

ముదిగొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అకాలంగా వీస్తున్న ఈదురుగాలులతో మొక్కజొన్న పంట నేలమట్టమవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రైతు ఏపంట సాగుచేసినా చేతికొచ్చేంతవరకు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. అసలే చీడపీడలతో సాగుచేసిన పత్తి, మిర్చి పంటలతో తీవ్రంగా నష్టపోయామని వాటిని తొలగించి మొక్కజొన్న పంట సాగు చేసిన రైతాంగానికి ఈదురుగాలులు, అకాల వర్షం కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది.

ముదిగొండ మండల వ్యాప్తంగా 12,600ఎకరాల్లో పెద్ద ఎత్తున రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పత్తి, మిర్చి పంటలు వివిధరకాల తెగుళ్ల, చీడపీడలతో పెట్టిన పెట్టుబడులు రాక అప్పులపాలైన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న పంట సాగుచేపట్టారు. ఇంకా నెలరోజుల వ్యవధిలో పంట చేతికి రానుండగా వాతావరణంలో మార్పులు రావడంతో అకాలంగా వీస్తున్న ఈదురుగాలులకు మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. ఒక ఎకరం మొక్కజొన్న పంట సాగుచేసేందుకు విత్తనాలు, దుక్కిదున్నటం, ఎరువులు, కూలీల ఖర్చు, పంట నూర్పిడి వంటి వాటికి రూ.45వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు తెలుపుతున్నారు. పంట ఎదగడం ఒక ఎత్తు అయితే అకాలంగా వచ్చిన ఈదురుగాలులకు నేలమట్టమైందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు 30క్వింటాళ్ల దిగుబడి రావల్సి ఉండగా పంట నేలవాలడంతో 15క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తుందని, పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే ఈ పరిస్థితి కొనసాగితే మొక్కజొన్న రైతుల కంట కన్నీరే మిగులుతుందని తెలుపుతున్నారు. మొక్కజొన్న పంటను అధికంగా సాగుచేయడంతో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి మద్దతు ధర కల్పించి తమను ఆదుకోవాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

చేతికొచ్చే సమయానికి పంట నేలకొరిగింది



● **కొమ్మూరి రమేష్, రైతు, ముదిగొండ**

గత ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మిర్చి పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయాం. ఆపంటలను తొలగించి ఏడున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశాను. గత నాలుగు రోజులుగా రాత్రివేళల్లో వచ్చే ఈదురుగాలులతో ఐదెకరాల్లోని మొక్కజొన్న నేలమట్టమైంది. ఎకరాకు ఇప్పటివరకు రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వం రైతులను దృష్టిలో ఉంచుకొని మొక్కజొన్న పంటకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలి.

తెలుగు కావ్య ప్రబంధ కథల గ్రంథాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం, మంత్రులు

భద్రాచలం, మార్చి23 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం రామాయణ, పారాయణదారులు ఎస్జీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు రచించిన తెలుగు కావ్య ప్రబంధ కథలు గ్రందాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో ఆదివారం ఈ గ్రంథాన్ని సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ ఆవిష్కరించారు. తెలుగు బాషలో ప్రసిద్ది చెందిన కవులు రచించిన కావ్యాలు ప్రబంధాల కథలు ఈ గ్రంధంలో ఉన్నాయి. కాగా తెలుగులో ఎంతో మంచి గ్రంధాన్ని రాశారని సీఎం రేవంత్ రచయిత అంతర్వేది కృష్ణమాచార్యులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రెవెన్యూ, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులు దళారులను ఆశ్రయించొద్దు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిక్రూట్‌మెంట్ జీఎం నికోలస్

రుద్రంపూర్, (సింగరేణి), మార్చి 23: సింగరేణిలో ప్రతిభ ఆధారంగానే ఉద్యోగ నియామకాలు ఉంటాయని అభ్యర్థులు ఎవరూ దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సింగరేణి రిక్రుట్‌మెంట్ సెల్ జనరల్ మేనేజర్ బెనడిక్ట్ నికోలస్ తెలిపారు. ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో చార్జ్‌హ్యాండ్ మెకానికల్, వెల్డర్ ట్రైనీ పోస్టుల భర్తీ కోసం అంతర్గత అ భ్యర్థులకు రాత పరీక్షలు నిర్వహించారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న చార్జ్‌హ్యాండ్ మెకానికల్ పోస్టులకు 56మంది అభ్యర్థులకు హాలు టిక్కెట్లు జారీ చేయగా 50మంది అభ్యర్థులు రాత పరీక్షలకు హాజరయ్యారు. వెల్డర్ ట్రైనీలో 14 పోస్టులు ఖాళీగా ఉండగా 32మంది అభ్యర్థులకు హాలు టిక్కెట్లు జారీ చేయగా 31మంది రాత పరీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉద్యోగ నియామాలు మెరిట్ ఆధారంగా జరుగుతాయని, అభ్యర్థులు ఎవరు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. ఎవరైన పైరవీలు చేస్తామంటూ విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ జీఎం వర ప్రసాద్, అధికారులు వేణుగోపాల్, వేణుమాధవ్, సమ్మయ్య, కళాశాల ప్రిన్సిపాల్ శారద తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌ను గర్భవతిని చేసిన యువకుడు

- కేసు నమోదు చేయకుండా పోలీసుల తాత్సారం
- ఉన్నతాధికారుల ఆదేశాలూ బేఖాతరు
- వాటర్ ట్యాంకు ఎక్కి ఆత్మహత్యకు యత్నించిన బాలిక
- ఎర్రుపాలెం పోలీసుస్టేషన్ ఎదుట బాలిక బంధువుల ఆందోళన

ఎర్రుపాలెం, మార్చి23(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువకుడు బాలికను గర్భవతిని చేసి మోసం చేసిన ఘటన ఆదివారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో వెలుగు చూసింది. తనకు న్యాయం చేయాలని సదరు బాలిక పోలీసులను ఆశ్రయించినా కిందిస్థాయి పోలీసు అధికారులు పట్టించుకోపోవడంతో సదరు బాలిక శనివారం పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించింది. వారి ఆదేశాలను కూడా స్థానిక పోలీసులు పట్టించుకోకపోవడంతో మనస్థాపం చెందిన బాలిక ఆదివారం పోలీసుస్టేషన్ పక్కన ఉన్న వాటర్‌ట్యాంకు ఎక్కి ఆత్మహత్యకు యత్నించింది. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలానికి చెందిన ఓ బాలిక(17)పై అదే గ్రామానికి చెందిన ముల్లంగి జమలయ్య (27) అనే యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు శారీరకంగా వాడుకున్నాడు. దాంతో సదరు బాలిక గర్భం దాల్చింది. ఆ తర్వాత బాలిక పెళ్లి చేసుకోవాలని కోరగా నిరాకరించి తప్పించుకుని తిరుగుతున్నాడు. ప్రస్తుతం ఆ బాలిక ఐదు నెలల గర్భవతి కావడంతో వారం రోజుల క్రితం ఎర్రుపాలెం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. అయినా ఎస్ఐ కేసు నమోదు చేయకుండా తాత్సారం చేయడంతో నేరుగా ఖమ్మం పోలీసు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. దాంతో చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. కానీ స్థానిక పోలీసులు సీపీ ఆదేశాలను కూడా బేఖాతరు చేసి కేసు నమోదు చేయలేదు. దాంతో మనస్థాపం చెందిన సదరు బాలిక ఆదివారం ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న వాటర్‌ట్యాంకు ఎక్కి ఆత్మహత్యకు యత్నించగా బాలిక బంధువులు, పోలీసులు అడ్డుకుని ఆమెను కాపాడారు. అనంతరం బాలిక బంధువులు పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అయితే ఓ మాజీ సర్పంచ్‌తో పాటు పోలీసు శాఖలోని అతడి కుటుంబసభ్యులైన ఇద్దరు వ్యక్తుల అండతోనే ఎస్ఐ కేసు నమోదుచేయడం లేదని బాలిక బంధువులు ఆరోపించారు. బాలిక మైనర్ కాదని తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించే ప్రయత్నం కూడా వారు చేసినట్టు ఆరోపించారు. కాగా బాలిక బంధువుల ఆందోళన ఉధృతం చేయడంతో నిందితుడిపై కేసు నమోదుచేస్తానని ఎస్ఐ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. స్థానిక పోలీసు అధికారి గతంలోనూ ఇదే తరహాతో వ్యవహరించేవారన్న ఆరోపణలున్నాయి. రైతుల ఆత్మహత్యలపై కూడా కేసులు నమోదు చేయడం లో నిర్లక్ష్యం వహించేవారనీ, ఫిర్యాదు పేరుతో ఆయనకు సంబంధం లేని విషయాల్లోనూ కలగజేసుకుని పంచాయతీలకు పూనుకునేవారన్న ఆరోపణలు న్నాయి.

అమెరికా జట్టుతో క్రికెట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి 31 వరకు హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో అమెరికా యూత్ క్రికెట్ అకాడమీ జట్టుతో జరగనున్న అండర్- 17 క్రికెట్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఖమ్మం జిల్లాకు గోవర్ధన్, ప్రియాంష్‌రెడ్డి, చందు భద్రాద్రి జిల్లాకు చెంది సాయిసాకేత్ ఎంపికయ్యారు. వారు ఇటీవల జరిగిన అంతర జిల్లాల క్రికెట్ పోటీలలో ప్రతిభ చూపి అమెరికన్ జట్టుతో పోటీలకు ఎంపికైనారు. ఈ సందర్భంగా టోర్నీకి ఎంపికైన క్రీడాకారులను పోలీస్ కమిషనర్ సునిల్‌దత్, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి తదితరులు అభినందించారు.

లిఫ్ట్ కూలి మృతిచెందిన ఘటనపై విచారణ

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో వైరారోడ్ ప్రసూన ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ అనంతరం లిఫ్ట్‌లో పై అంతస్తుకు తీసుకెళ్తుండగా కుప్పకూలి మహిళారోగి మరణించిన సంఘటనపై ఆదివారం జిల్లా వైద్యాధికారులు శాఖాపరమైన విచారణ చేపట్టారు. శుక్రవారం రాత్రి ప్రసూన ఆస్పత్రిలో సట్టు సరోజిని (62)అనే రోగి ఐసీయూకు తరలించే సమయంలో లిఫ్ట్ అదుపు తప్పి స్ట్రెచర్ పైనే ప్రాణాలు విడిచిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆదివారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు ఆసుపత్రిలో సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. ఆసుపత్రి వైద్యులను,సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక లోపంతో లిఫ్ట్ అదుపు తప్పి ప్రమాడానికి గురి అయినట్లు గుర్తించారు. ఉన్నతాధికారులతో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి నివేదించారు. అనంతరం ఆసుపత్రికి నోటీసు అందించారు.

విలీన ప్రాంత సమస్యల పరిష్కార దిశగా..

రూ.102.82 కోట్లతో కార్పొరేషన్ బడ్జెట్

మూడేళ్లలో గణనీయంగా పెరిగిన ఆదాయ, వ్యయం

రేపు ఖమ్మం నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశం

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత ఆదే స్థాయిలో అభివృద్ధి చెందే నగర పాలక సంస్థలో ఖమ్మం ముందు వరసలో ఉంది. ఆదాయ రాబడి నుంచి వ్యయం వరకు అదే లెక్కలు చూపుతున్నాయి. గత మూడేళ్ల కాలంలో ఖమ్మం నగర పాలక సంస్థకు గణనీయంగా ఆధాయం పెరగగా ఆ మేరకు వ్యయం కూడా పెరిగింది. అయినా ఖమ్మం నగర పాలక వర్గం ఏ మాత్రం అభివృద్ధిలో వెనుకడుగు వేయటం లేదు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యవేక్షణలో మేయర్ పునుకొల్లు నీరజ కేఎంసీకి ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఒక వైపు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉద్యోగులకు, సిబ్బందికి ఎప్పుడు వేతనాలు ఆగకుండా సొంతంగా ఆర్థిక వ్యవస్థను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటున్నారు.

మూడేళ్లలో భారీగా పెరిగిన బడ్జెట్

గత మూడేళ్ల కాలంలో కేఎంసీ ఆదాయ, వ్యయాలు భారీగా పెరిగాయి. 2023-24లో రూ.67.08 కోట్లకు బడ్జెట్‌ను రూపొందించి అమలు చేశారు. 2024-25లో రూ.80.67 కోట్ల బడ్జెట్‌ను అమలు చేశారు. 2025-2026కు మాత్రం రూ.102.82 కోట్లతో బడ్జెట్‌ను సిద్దం చేశారు. కేవలం మూడేళ్ల కాలంలో రూ.35 కోట్ల బడ్జెట్ పెరిగింది. ఇది నగర పాలక సంస్థల నిర్వాహణలో ఓ రికార్డుగా అధికారులు పేర్కొంటున్నారు. షెడ్యూల్ 12 ప్రకారం కేఎంసీ సొంతంగా నిధులు సమకూర్చుకొవటం, రెండోది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా వచ్చే ఆదాయం, మూడోది

ఆదాయం ఇలా..

కేఎంసీకి ట్యాక్స్ కలెక్షన్ ద్వారా రూ.33.92 కోట్ల అంచనాలు వేశారు. ఇప్పటికే రూ.28 కోట్లు ట్యాక్స్ వసూళ్లు జరిగాయి. ఈనెల చివరి వరకు నూరుశాతం లక్ష్యం పూర్తి జరిగే అవకాశాలు ఉన్నాయి. స్టాంప్ డ్యూటీ ద్వారా రూ.13 కోట్లు, కేఎంసీ పరిధిలో భవనాల అద్దెల ద్వారా రూ. 4.43 కోట్లు, పారిశుధ్య పన్నుల ద్వారా రూ.3.61 కోట్లు, పట్టణ ప్రణాళిక ద్వారా రూ.36.10 కోట్లు, ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.11.76 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్సులు, ఇతర రాబడి ద్వారా మరో రూ.6.76 కోట్ల ఆదాయం వస్తుందని పాలకవర్గం అంచనాలు వేసింది. కేఎంసీ ద్వారా రూ.102 కోట్లు అంచనాలు వేస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రూ.82కోట్లు

కేంద్ర ప్రభుత్వం ద్వారా స్వచ్ఛ బారత్, అమృత్ 2.0, 15 మరియు 16వ ఆర్థిక సంఘం ద్వారా, పారిశుద్య నిర్వాహణ ప్రమాణాలు పాటించినందుకు గాను కేంద్రం ప్రత్యేక నిధులు కేటాయింపు చేస్తోంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, ముఖ్యమంత్రి అభయ నిధి, ఎల్ఆర్ఎస్ బదలాయింపులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిధులు ద్వారా మొత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా మరో రూ. 82కోట్లు కేఎంసీకి రానున్నాయి.



ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం (ఫైల్)

వ్యయం ఇలా..

కేఎంసీ వ్యయంపై పాలకవర్గం అంచనాలు రూపొందించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు రూ.30.70 కోట్లు, పారిశుధ్య నిర్వహణకు రూ.11.16 కోట్లు, విద్యుత్ చార్జీలకు రూ.10.90కోట్లు, రుణాలు చెల్లింపులకు రూ.2.01 కోట్లు, గ్రీన్ బడ్జెట్‌కు రూ.10.28 కోట్లు, ఇంజనీరింగ్ విభాగం నిర్వాహణకు రూ.7.77 కోట్లు, సాధారణ పరిపాలన వ్యయానికి రూ.5.83 కోట్లు, వార్డు బడ్జెట్ రూ.14.97 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్స్‌ల చెల్లింపులకు రూ.6.76 కోట్లు వ్యయం జరుగుతుందని అంచనాలు రూపొందించారు.

విలీన ప్రాంతాలపై దృష్టి

ఖమ్మం నగరంలో మైదాన ప్రాంతంలోని కొన్ని డివిజన్లు ఇప్పటికే అభివృద్ధి చెందాయి. తాజా బడ్జెట్‌లో నిధుల్లో మూడో భాగం నిధులు విలీన ప్రాంతాల అభివృద్ధికి కేటాయించారు. అభివృద్ధి తక్కువగా (స్లమ్) ఉన్న ప్రాంతాలకు కేటాయించారు. ప్రధానంగా రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, వీది దీపాలకు కేటాయించారు. సాదారణ డివిజన్‌లకు రూ.30లక్షల నుంచి రూ.40 లక్షల నిధులు కేటాయిస్తే విలీన ప్రాంత డివిజన్లకు రూ.కోటి నుంచి రూ.కోటీ 40 లక్షల వరకు కేటాయించే అవకాశం ఉంది.

విలీన ప్రాంతాల అభివృద్ధికే

పునుకొల్లు నీరజ, ఖమ్మం మేయర్



ఖమ్మం మేయర్‌గా నాల్గొ బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నా. గతంలో మూడు బడ్జెట్‌ల కంటే విభిన్నమైన బడ్జెట్ మంగళవారం అమోదం జరగబోతుంది. బడ్జెట్‌లో మూడో వంతు నిధులు మైదాన ప్రాంతంలో అభివృద్ధి జరగని డివిజన్లతో పాటుగా విలీన ప్రాంతాల డివిజన్లకు కేటాయింపులు జరుగుతున్నాయి. రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, వీది దీపాల, ఇతర ప్రజా అవసరాలకు నిధులు కేటాయింపు జరుగుతుంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే రూ.100 కోట్లు నిధులు ఇచ్చారు. గతంలో స్టాంప్ డ్యూటీ ట్యాక్స్‌లు రాలేదు. ఈ సారి ట్యాక్స్ కలెక్షన్ ద్వారా రూ.32 కోట్లు ఆదాయం వస్తుంది. స్టాంప్ డ్యూటీ ద్వారా భారీగా ఆదాయం పెరుగుతుంది. ఆదాయ రాబడికి ఇబ్బంది లేదు. ప్రజా సమస్యలు పరిష్కారమే ఏజెండాగా బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నాం.

రామయ్యకు గోటి తలంబ్రాల సమర్పణ

భూపాలపల్లి జిల్లా నుంచి తరలివచ్చిన భక్త బృందం

భద్రాచలం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీరామనవమికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కు చెందిన భక్తులు గోటి తలంబ్రాలను భక్తి ప్రపత్తులతో సమర్పించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఘనపురం మండలం చెల్పూర్ కు చెందిన శ్రీరామదాసు భక్త మండలి బృందం ఆదివారం భద్రాచలం చేరుకుంది. ఈ సమయంలో దశమ కోటి తలంబ్రాల జ్ఞాన యజ్ఞంలో భాగంగా శ్రీరామ నామంతో వలిచిన వడ్లను కోటి తలం బ్రాలుగా సేకరించి దేవస్థానంలో పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, అరుణ్‌కుమార్‌లకు అందజేశారు. అంతకు ముందు రామదాసు భక్త మండలికి చెందిన భక్త బృందం జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్ అంటూ రామనామస్మరణ చేస్తూ శిరస్సుపై తలంబ్రాలను ఉంచుకుని గిరి ప్రదిక్షణ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించిన సంగారెడ్డి ఎస్పీ

భద్రాచలంలోని సీతారామచంద్రస్వామిని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారిని



రామయ్య ఆలయంలో సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంప్రదాయబద్దంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట భద్రాచలం సీఐ బరపాటి రమేష్, ఎస్ఐ మధు ప్రసాద్, దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా పాల్గొన్నారు. ఆదివారం కావటంతో భక్తులు కూడా అధిక సంఖ్య లో తరలివచ్చారు.

మధిరలో కవులు, కళాకారులకు ఆదరణ

మధిరటౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మధిరలో కళలను కళాకారులను ఆదరించేవారు ఉండబట్టే ఈ ఆధునిక కాలంలో కూడ ఇటువంటి నాటక పోటీలు నిర్వహించ కలుగుతున్నామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. వాసిరెడ్డి రామనాథం అన్నారు. మధిరలోని వెంకటేశ్వరస్వామి కళ్యాణమండపంలో సీతారామాంజనేయ కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండు తెలుగు రాష్ట్రాల నాటక పోటీల ముగింపు కార్యక్రమలో ఆయన పాల్గొన్నారు. మధిరలో వివిధ కళాపరిషత్ వారు నాటక పోటీలను నిర్వహిస్తూ అంతరించి పోతున్న కళలను బతికిస్తున్నారని ఇది ఎంతో అభినందనీయం అని అన్నారు. ఆఖరి రోజు పలువురు కళాకారులు ప్రదర్శించిన పలు సాంఘిక, పౌరాణిక కళారూపాలు ఆహూ తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శనరావు, మధిర డివిజన్ కార్యదర్శి గోపాలరావు, టీడీపీ నాయకులు మల్లాది హనుమంతరావు, నిర్వాహకులు గడ్డం శ్రీనివాసరావు, సుబ్బారావు, పుతుంబాక కృష్ణప్రసాద్, మునుగోటి వెంకటేశ్వర్లు, గురువులు, బాబ్లా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసిరెడ్డి రామనాథం

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- గుర్తు తెలియని వాహనం ఢీకొని తల్లీ కుమారుడు..
- రెండు వాహనాలు ఢీకొని డ్రైవర్ మృతి

దమ్మపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దమ్మపేట మండలం ముష్టిబండ, గాంధీనగర్ గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం వేరువేరుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటనకు సంబందించిన దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం - అశ్వారావుపేట ప్రధాన రహదారిపై గాంధీనగర్ గ్రామం వద్ద గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆంధ్రరాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన అరిసేపల్లి సరస్వతి(65), అరిసేపల్లి క్రిష్ణ(45) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం గ్రామంలో బంధువులు ఇంటికి తల్లీ కుమారుడు ద్విచక్రవాహనంపై వెళుతుండగా ప్రమాదం జరిగింది.

ఈ ప్రమాదం జరిగిన గంట తరువాత ఒక కిలో మీటర్ దూరంలో ముష్టిబండ గ్రామ సమీపంలో లారీ, డీసీఎం వ్యాను ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదానికి గురైన లారీలు వెస్ట్‌బెంగాల్, ఉత్తరాఖండ్‌కు చెందినవిగా గుర్తించారు. ఈ ప్రమాదంలో రెండులారీల మధ్యలో డ్రైవర్ ఇరుక్కుపోయి మృతి చెందగా మృతుడు ఉత్తరాఖాండ్‌కు చెందిన ఆశిష్‌పాలేగా పోలీసులు గుర్తించారు. ఈప్రమాదంలో రెండు లారీలకు చెందిన డ్రైవర్, క్లీనర్లు గాయపడగా వారిని అశ్వారావుపేట వైద్యశాలకు తరలించారు. రెండు లారీలు ఢీకొని రోడ్డుకు అడ్డంగా పడి పోవటంతో సత్తుపల్లి నుంచి వచ్చే లారీలు, అశ్వారావుపేట నుంచి వచ్చేలారీలు రెండువైపుల ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రధాన రహదారిపై ప్రమాదం జరగటంతో రహదారిపై భారీగా వాహనాలు నిలిచి పోవటంతో అశ్వారావుపేట వైపు నుంచి వచ్చే వాహనాలు పోలీసులు అశ్వారావుపేటలో నిలిపివేసారు. అనంతరం ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి రహదారిని క్లియర్ చేసేందుకు మరో రూటుకు వాహనాలను మళ్ళించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీలను తొలిగించేందుకు జేసీబి తెప్పించి ప్రమాదానికి గురైన వాహనాలు తొలిగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసారు. ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

దమ్మపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని పార్కలగండి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. ఈఘటనకు సంబందించి దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోండ్రు శివ (19) జీవితంపై విరక్తి చెంది ఎవరూ లేని సమయంలో ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి శీతారాములు ఆదివారం దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

కమలాపురం ఆశ్రమ పాఠశాలలో ఘటన

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

ములకలపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ములకలపల్లి మండలం కమలాపురం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఆ శ్రమ పాఠశాల గదిలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు సంబంధించిన పరుపులు, పాత బెంచీలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం జరిగినప్పుడు విద్యార్థులు స్టడీ అవర్స్‌లో ఉండటంతో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ విషయంపై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపులోకి తెచ్చింది.

యాసిడ్ ట్యాంకర్‌ను ఢీకొన్న లారీ

ట్యాంకర్ నుంచి లీకైన యాసిడ్.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

తల్లాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అంబేద్కర్‌నగర్ వద్ద శనివారం అర్ధరాత్రి తల్లాడ-వరంగల్ జాతీయ రహదారిలో యాసిడ్ ట్యాంకర్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ నుంచి యాసిడ్ లీకై పొగలు కమ్మేయడంతో ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో తల్లాడ నుంచి వైరా, ఖమ్మం నుంచి తల్లాడ వైపు వచ్చే వాహనాలను పోలీసులు దారిమళ్లించారు. ఐదుగంటల అనంతరం ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు యధావిధిగా కొనసాగాయి. అంబేద్కర్‌నగర్ వద్ద తల్లాడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న యాసిడ్ ట్యాంకర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ నుంచి యాసిడ్ లీకై దట్టమైన పొగ కమ్మేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనదారులు అవస్థలు పడ్డారు. తల్లాడ నుంచి ఖమ్మం, ఖమ్మం నుంచి తల్లాడ వైపు వెళ్లే వందలాది వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ బి.కొండల్‌రావు పోలీసు సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. తల్లాడ రింగ్‌రోడ్డు సెంటర్ నుంచి ఖమ్మం వైపు వెళ్లే వాహనాలను గొల్లగూడెం, పినపాక మీదుగా, ఖమ్మం నుంచి తల్లాడ వైపు వచ్చే వాహనాలను కొణిజర్ల మండలం పల్లిపాడు మీదుగా దారిమళ్లించారు. ఆదివారం తెల్లవారుజామున ఐదుగంటల నుంచి అంబేద్కర్‌నగర్ వద్ద తల్లాడ-వరంగల్ జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలను యధావిధిగా కొనసాగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

కలకలం రేపుతున్న మహిళ కిడ్నాప్

పెనుబల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లా పెనుబల్లి మండలం గౌరారం టోల్‌ప్లాజా వద్ద ఈనెల 21వతేదీన ఉదయం 11గంటల సమయంలో మహిళను కొట్టి కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేసిన వ్యవహారం మండలంలో కలకలం రేపింది. గౌరారం టోల్‌ప్లాజా గుర్తుతెలియని వ్యక్తులు ఓ మహిళపై దాడి చేసి కారులో ఎక్కించుకొని పరారయ్యారు. ఈనెల 21న 11గంటల సమయంలో జరిగిన మహిళ కిడ్నాప్ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టోల్‌ప్లాజా వద్ద సీసీ కెమెరాల్లో కిడ్నాప్ దృశ్యాలు రికార్డయ్యాయి. కిడ్నాప్‌కు సంబంధించిన దృశ్యాలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. అయితే ఈ ఘటనలో కిడ్నాప్‌కు గురైన మహిళ ఎవరు, ఆమెను కొట్టిన వ్యక్తి, కిడ్నాప్‌లో పాల్గొన్న మరో మహిళ ఎవరనేది తెలియాల్సి ఉంది. ఈ విషయమై పోలీసులు మాత్రం తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలుపుతున్నారు. అయినప్పటికీ ఈ ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమైనట్లు ప్రచారం జరుగుతుంది. ఏదీ ఏమైనప్పటికీ పెనుబల్లి మండలంలో ఓ మహిళను కొట్టి కారులో బలవంతంగా ఎత్తుకెళ్లిన ఘటన తీవ్ర సంచలనంగా మారింది. ఇంతవరకు ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు ఎప్పుడూ చోటుచేసుకోలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

రూ.పది కోట్లతో సేవా కార్యక్రమాలు

వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్



మాట్లాడుతున్న సూర్యప్రకాష్‌రావు

ఖమ్మం గాంధీచౌక్, మార్చి23(ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ తరపున ఈ సంవత్సరం పది కోట్ల రూపాయలతోసేవా కార్యక్రమాలు జరగనున్నాయని, ఈ సంవత్సరం విద్యకు వైద్యానికి ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నామని ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సిద్ధవెంకట సూర్య ప్రకాష్ రావు అన్నారు. ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాల వాసవి క్లబ్స్ గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు అధ్యక్షతన జిల్లా మొదటి క్యాబినెట్ సమావేశం, మైక్రో క్యాబినెట్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సిద్ధ వెంకట సూర్య ప్రకాష్ రావు, కడవెండి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సూర్య ప్రకాష్ రావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి చేస్తున్న సేవలు చాలా గొప్పగా ఉన్నాయని అభినందించారు. వాసవి గవర్నర్ కొత్త వెంకటేశ్వర్ రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐఈసీ ఆఫీసర్లు రేగూరి హనుమంతరావు, పోలిశెట్టి శివకుమార్ ఎర్రం సుజాత, దోసపాటి వెంకటేశ్వరరావు, గుమ్మడవెల్లి శ్రీనివాస్, క్యాబినెట్ నుంచి గోళ్ల రాధాకృష్ణమూర్తి, గుంటుపల్లి దివాకర్ గుప్తా, మాసెట్టి వరప్రసాద్, కొత్తూరు రమేష్ పసుమర్తి , రామ్మోహన్రావు, పులిపాటి ప్రసాద్, బచ్చు మురళీకృష్ణ, బూర్లె పుల్లారావు, ఎర్రం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

దండం పెట్టి.. కాళ్లు మొక్కిన ఎమ్మెల్యే

పంచాయతీ భవనానికి స్థలం ఇచ్చిన స్వాతంత్ర సమరయోధుడు



దండం పెడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుల దంపతులకు దండం పెట్టి కాళ్లు మొక్కారు ఎమ్మెల్యే కోరం కనకయ్య. కామేపల్లి మండలం రామక్రిష్ణాపురం గ్రామంలో ఐటీడీఏ నిధులు రూ20లక్షల వ్యయంతో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నూతనంగా నిర్మించారు. ఆ భవన నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు దీవెల వెంకయ్య, సీతమ్మ దంపతులు తమకున్న ఇంటి స్థలాన్ని గ్రామ పంచాయతీకి విరాళంగా అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యే కోరం కనకయ్య కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రభుత్వానికి సొంత స్థలం విరాళంగా ఇచ్చిన దంపతులను అభినందించి వారికి దండం పెట్టి ఘన సన్మానం చేసి వారి కాళ్లను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మొక్కారు. అంతకుముందు ఎమ్మెల్యే కనకయ్య పాతలింగాలలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, హైస్కూల్‌లో ఓ భవనాన్ని ప్రారంభించారు.

నేడు కేఎంసీ ప్రజావాణి రద్దు



ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి23(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజావాణి సోమవారం రద్దు చేసినట్లు కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదివారం ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన, ఎల్ఆర్ఎస్, ఆదాయ వసూళ్ల, ఇతర పనులు కారణంగా కేఎంసీలోని పలువిభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేలో ఉన్నందున ప్రజావాణి రద్దు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు.

వర్షాకాలంలోపు రహదారి
పనులు పూర్తిచేయాలి

» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న మంత్రి

ఖమ్మంరూరల్,మార్చి23(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలోపు రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని వెంకటగిరి, గుదిమళ్ల, గుర్రాలపాడు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. గుర్రాలపాడులో రూ.2కోట్ల, 85 లక్షలతో గుర్రాలపాడు నుంచి కోట నారాయణపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణం, వెంకటగిరి ఎస్సీ, బీసీ కాలనీ నుంచి ఖమ్మం గుదిమళ్లలో గుదిమళ్ల నుండి త్రిరి వాగు డొంక రైస్ మిల్లు వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలో చేపట్టిన రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా ప్రజలకు ఇచ్చిన హమీలను ఒక్కోటి అమలు చేసుకుంటు వస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఆర్డీఓ నరసింహరావు, పీఆర్ ఈఈ వెంకట్ రెడ్డి, కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథబాబు, జిల్లా నాయకులు తమ్మినేని నవీన్, మండల నాయకులు బొల్లం వెంకన్న, సురేష్ నాయక్, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

స్వాతంత్ర్య పోరాటంలో అసువులు భాసిన భగత్‌సింగ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సీపీఐ,సీపీఎం, సీపీఐఎంఎల్ మాస్‌లైన్, పీవైఎల్, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఖమ్మంలో కాగడాల ప్రదర్శనలు చేపట్టారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ ప్రాణత్యాగాలను గుర్తు చేసుకున్నారు. వారి స్ఫూర్తితో ప్రజావ్యతిరేఖ పాలనపై ఉద్యమాలు చేయాలన్నారు. : నెట్‌వర్క్



కాకరవాయిలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన



కాగడాల ప్రదర్శన చేస్తున్న పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు



సీపీఎం ఆధ్వర్యంలో..

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కార్పొరేటర్ శరత్‌కుమార్‌కు చెక్కు పంపిణీ చేస్తున్న మేయర్

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మేయర్ పూనుకొల్లు నీరజ, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావులు కార్పొరేటర్ రాపర్తిశరత్‌కుమార్‌కు అందించారు. ఖమ్మం నగరంలో మొత్తం71 మందికి ఇటీవల రూ.22 లక్షల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులు మంజూరు జరిగాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగందర్, మిక్కిలినేని నరేందర్, కొప్పెర ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ తరగతులు నిర్వహించాలి

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి23(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ తరగతులను నిర్వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని అన్నారు. ఆదివారం నగరంలోని సంఘం భవన్‌లో జిల్లా అధ్యక్షుడు రంజాన్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దానిలో బాగంగానే పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలన్నారు.ఈ సమావేశంలో పారుపల్లి నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, రాంబాబు, షరీఫ్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న రుద్రాక్ష ఎగ్జిబిషన్



ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలోని ఆర్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్ సోమవారం ముగియనున్నందని నిర్వాహకులు దుర్గాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఏకముఖి నుంచి వివిధ రకాల రుద్రాక్షలు, కరంగళిమాలలు, జాతిరత్నాలు లభిస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ఖమ్మం ప్రజలు వినియోగించుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

ఇళ్ల పట్టాలివ్వాలని రిలే దీక్షలు

తిరుమలాయపాలెం, మార్చి23(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం గ్రామంలో గత ప్రభుత్వహయాంలో 130 కుటుంబాలకు ఇళ్లస్థలాలు ఇచ్చి వారికి పట్టాలు ఇవ్వలేదని, డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో రిలేనిరాహారదీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ గ్రామంలో ఇళ్లస్థలాలు లేక దళితులు, గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, అర్హులను గుర్తించి ఇళ్లస్థలాలు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం నేడు తిరుమలాయపాలెంలో ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేందర్, ఎన్.వెంకటేష్, తురకల వెంకన్న, మద్దినేని శ్రీను, పి.ముత్తయ్య, రాము, కెనాగేశ్వరరావు పాల్గొన్నారు

శభాష్ డీఆర్ఎఫ్

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి23(ఆంధ్రజ్యోతి):ఖమ్మంనగర పాలక సంస్థలోని డీఆర్ఎఫ్ బృందాలు ఆదివారం ఖమ్మంనగరంలోని 7వడివిజన్ ప్రజల మన్ననలు పొందారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ భారీవృక్షం రహదారిపై పడి ప్రజలు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో విషయం తెలుసుకున్న డీఆర్ఎఫ్ (డిజాస్టర్ రిస్పాన్స్ ఫోర్స్) బృందం సంఘటన ప్రాంతానికి చేరుకుంది. నిమిషాల్లో భారీవృక్షాన్ని కట్ చేశారు. రహదారిని క్లీయర్ చేశారు. దీంతో స్థానికులు డీఆర్ఎఫ్ బృందానికి అభినందనలు తెలిపారు.



చంద్రబాబుపై కేసీఆర్ వ్యాఖ్యలు అర్థరహితం

టీడీపీ నాయకుడు కేతినేని హరీష్

ఖమ్మంమామిళ్లగూడెం,మార్చి23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధ్యక్షుడు మాజీ సీఎం కేసీఆర్ ఏపీసీఎం చంద్రబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యలు అర్థరహితమని టీడీపీ నాయకుడు కేతినేని హరీష్ ఖండించారు. తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీరును ఖండించారు. చంద్రబాబులా ఎవరితో పొత్తు పెట్టుకోబోమని బీజేపీ మెడపై కత్తి పెట్టినా లొంగలేదని కేసీఆర్ ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నారు. బీఆర్ఎస్‌తో ఏపార్టీ పొత్తు పెట్టుకోవడానికి ఒప్పుకోకనే సింగిల్‌గా పోటీ చేస్తానని పేర్కొన్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి టీటీడీ దేవస్థానంపై చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. కలియుగదైవం వెంకటేశ్వరస్వామి అందరివాడని వారిపై భక్తులకు ద్వేషం వచ్చేలా మాట్లాడిన తీరు రాష్ట్రానికి మంచిది కాదన్నారు.

టీబీఎస్ఎస్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య(టీబీఎస్ఎస్)రాష్ట్ర నూతన కార్యవర్గానికి ఆదివారం సిద్దిపేటలోని స్వర్ణగిరి ఆలయంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర నూతన అధ్యక్షుడుగా మోతుకూరి రామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వైద్య ప్రభాకర్ శర్మ, కోశాధికారిగా సముద్రాల విజయసారధి, గౌరవ చైర్మన్‌గా వెన్నంపల్లి జగన్‌మోహన్‌శర్మ తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఖమ్మం జిల్లా నుంచి టీబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు సురావజ్ఞలవాసు శర్మ, యువజన అధ్యక్షుడు సరస్వతీ భట్లశర్మ, రీజనల్ కోఆర్డినేటర్ తాటికొండల సీతారామశాస్త్రీ, ప్రచార కార్యదర్శి ఆమంచి సురేష్ శర్మలు హాజరయ్యారు. ఎన్నికల్లో పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

30 నుంచి అభయ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

» ఏప్రిల్ 1న స్వామి కళ్యాణం, ఊరేగింపు
» 3న మహాపుష్పాభిషేకం, అన్నదానం

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి23(ఆంధ్రజ్యోతి): ఖానాపురంహవేలి యూపీహెచ్ కాలనీలోని శ్రీఅభయ వెంకటేశ్వరస్వామి వారి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 30 నుంచి ప్రారంభంకానున్నాయని ఆలయ కమిటీ తెలిపింది. ఆదివారం ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలయ అధ్యక్షుడు బొల్లి కొమరయ్య ఈవివరాలు వెల్లడించారు. 30న సాయంత్రం విశ్వేక్షేనపూజ, ధ్వజారోహణ, 31న మూలవరులకు అష్టోత్తర శతకలశస్నపన,(108 కలశములతో), సాయంత్రం సామూహిక కుంకుమపూజ, 1న విశేషఅలంకరణ, స్వామివారి ఎదుర్కోలు సంవాదం, అనంతరం స్వామి కల్యాణం, 2నసుదర్శన హోమం, 3న వసంతోత్సవం, చక్రస్నానము, మహాపుష్పాభిషేకం, మహాఅన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురం తిరుపయ్య, బానోత్ మల్సూర్‌నాయక్, అర్చకుడు నరగిరి నాథుని రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కేసీఆర్‌కు బాబు భయం పట్టుకుంది

టీడీపీ పాలేరు ఇన్‌చార్జ్ కొండబాల



నేలకొండపల్లి, మార్చి23(ఆంధ్రజ్యోతి): కేసీఆర్‌కు చంద్రబాబు భయం పట్టుకుందని టీడీపీ పాలేరు ఇన్‌ఛార్జి కొండబాల కరుణాకర్ డిమాండ్ ఎద్దేవా చేశారు. ఆదివారం నేలకొండపల్లి వచ్చిన కరుణాకర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం బీఆర్ఎస్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. అయ్య, కొడుకు నోరు జారినందుకే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు తగిన బుద్ధి చెప్పారని, ఆవిషయాన్ని కేసీఆర్ అప్పుడే మర్చిపోయినట్లున్నాడన్నారు. రానున్న ఎన్నికల్లో సైతం తెలుగుదేశం కీలక పాత్ర పోషిస్తుందనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. తెలంగాణాలో ఎన్‌డీఏ అధికారంలోకి వస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ సమావేశంలో ఆరెకట్ల కొండలరావు, సూరపనేని రామకృష్ణ, నలమాస మల్లయ్య, నూక హనుమంతరావు, కోలేటి మస్తాన్‌రావు, వీసం శ్రీనివాసరావు, అక్కినేని నాగేశ్వరరావు, మద్దినేని మహేష్, నూతక్కి ప్రసాద్, తాటికొండ నాగేశ్వరరావు, గోగినేని సీతారామారావు, పావులూరి వెంకటేశ్వరరావు, తాడేపల్లి వెంకటేశ్వర్లు, తీగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభ

సంఘం అధ్యక్షుడు యాకూబ్‌హుస్సేన్



మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నేలకొండపల్లి,మార్చి23(ఆంధ్రజ్యోతి):ఈనెల 25న మహబూబ్‌నగర్‌లో జరుగనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు షేక్.యాకోబ్‌హుస్సేన్ కోరారు. ఆదివారం నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా యాకోబ్‌హుస్సేన్ మాట్లాడుతూ 50 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా నెలకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ వైద్యశాలల్లో ఉచిత వైద్య సౌకర్యాలు కలిగించాలని, కార్మికుల భద్రతకు మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 25న మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రాష్ట్ర మహాసభలో వేల సంఖ్యలో కార్మికులు పాల్గొని, సభను విజయవంతం చేయాలని, కార్మిక శక్తిని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కార్యదర్శి పిచ్చయ్య, నాయకులు పెద్దపాక వెంకన్న, శ్రీనివాసులు, రాజపుత్ర జనార్ధన్‌సింగ్, చట్టు శ్రీనుతదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

కోదాడ వైద్యుడు రామారావు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రామారావు

నేలకొండపల్లి,మార్చి23(ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తిని తీర్చటానికి చలివేంద్రాన్ని ప్రారంభించటం అభినందనీయమని కోదాడకు చెందిన ప్రముఖ డాక్టర్ రామారావు అన్నారు. నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీపీఎం కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎన్టీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే నెలనెలా వైద్యశిబిరాలు, యువతకుకంప్యూటర్ శిక్షణ అందించటం గొప్ప విషయమన్నారు. ముందుందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు, భక్తరామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షులు ఏటుకూరి రామారావు, ఎన్టీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి, కొడాలి భాస్కరరావు, గెల్లా జగన్మోహన్‌రావు, గెల్లా వెంకటరమణగుప్తా, మంకెనపల్లి నర్సింహారావు, భూక్యా కృష్ణ, రాగి వీరబ్రహ్మాచారి, షేక్.అబ్దుల్, కోడూరి వెంకటాచారి, సామాల మల్లికార్జునరావు, ఈగా అనిల్ పాల్గొన్నారు.

రామారావు సేవలు ఆదర్శం

ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ



రామారావును సన్మానిస్తున్న సైదులు

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి23(ఆంధ్రజ్యోతి): నయబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఉద్యో విరమణ చేసిన విశ్రాంత ప్రధానాచార్యులు రామారావు సేవలు నేటితరం ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ఆదర్శనీయమం అని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు అన్నారు. ఆదావారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో రామారావుకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గండు యాదగిరి, షేక్ మన్సూర్, పావం శ్రీనివాసరావు, వెంకన్న, నరసింహారావు పాల్గొన్నారు.

చేతివృత్తులకు ప్రభుత్వ సాయం



మాట్లాడుతున్న దయాకరరెడ్డి

ఖమ్మంచర్చికాంపౌండ్,మార్చి23(ఆంధ్రజ్యోతి):చేతివృత్తుల వారికితెలంగాణ ప్రభుత్వ సహాయ సహకారాలు తప్పకుండా అందిస్తుందని జిల్లాకాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ విశ్వబ్రాహ్మణ/విశ్వకర్మ సంఘం నగర 59వ డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా దయాకరరెడ్డి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు చేతివృత్తులకు దూరమై దుర్భర జీవితం గడుపుతున్నారని, కాలానికి అనుగుణంగా ప్రభుత్వం వివిధ వృత్తుల్లో స్థిరపడడానికి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో నగరంలో విశ్వబ్రాహ్మణుల కమ్యూనిటీహాల్ నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చేలా కృషిచేస్తానన్నారు. అధ్యక్షుడుగా తాటికొండ వెంకటాచారి,ఉపాధ్యక్షుడిగా అనుముల సోమేశ్వరాచారి, ప్రధాన కార్యదర్శిగా ముమ్మారి రాజయ్యచారి, కోశాధికారిగా జుజ్జ వెంకటేశ్వరరావుతో పాటు 20 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సంఘంజిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోట సోమేశ్వచారి,విజగిరి సందానందచారి, వెగ్గళం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధనియాకులకు యుగంధర్ పరామర్శ

కామేపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు తండ్రి వీరయ్య ఇటీవల మృతి చెందాడు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగందర్ హన్మంతరావును పరామర్శించారు. అంతకముందు ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధకిషోర్ కూడా పరామర్శించారు. మండల అధ్యక్షుడు నర్సింహరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లమోతు లక్ష్మయ్య, జగన్నాథరెడ్డి, తోటకూరి శివయ్య, డీఎస్, గుజ్జర్లపుడి రాంబాబు, భాష, దొడ్డ వేణు, దారావత్ అనురాధ, హరి పరామర్శించిన వారిలో ఉన్నారు.

'గోపా' కమిటీ ఎన్నిక

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి23(ఆంధ్రజ్యోతి): గౌడ అఫీషియన్స్‌అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోపా) సమావేశం ఆదివారం నగరంలోని ఐఎంఎల్ హాల్ నిర్వహించారు. ఈసమావేశం జిల్లా అధ్యక్షుడు గుడిద శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కమిటీని ఎన్నుకున్నారు. గోపానూతన అధ్యక్షుడిగా డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బొలగాని శ్రీనివాసరావు, కోశాధికారిగా దండుయాదగిరిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా బొల్లికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో గోపా చేపట్టిన పలు సేవా సామాజిక కార్యక్రమాలు చేపట్టామన్నారు. గౌడ విద్యార్థులకు మెరిట్ అవార్డులు, నగదు బహుమతి, పురస్కారాలు అందిస్తామన్నారు. గోపా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టి సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అన్ని జిల్లాల్లో కూడా సంఘాన్ని బలోపేతం చేస్తున్నట్టు తెలిపారు.ఈకార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిద శ్రీనివాస్, బిచ్చాల తిరుమలరావు, ఈడ శేషగిరిరావు, జీవీ శ్రీనివాస్, రాంమోహన్‌గౌడ్, అమరగాని వెంకన్నగౌడ్, బోడపట్ల వెంకన్నగౌడ్, కత్తి నెహ్రూగౌడ్, శ్రీదేవి, సురేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

బార్ అధ్యక్ష పదవి రేసులో ఇద్దరు న్యాయవాదులు



కేశన శంకరరావు

సత్తుపల్లిరూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవి రేసులో ఇద్దరు సీనియర్ న్యాయవాదులు మల్లేపూల వెంకటేశ్వరరావు, పీ.రామనరసింహారావులు నిలిచారు. కాగా ఉపాధ్యక్ష పదవి బరిలో నుంచి గండ్ర దీన్ దయాళ్‌రెడ్డి తప్పుకోవడంతో నామినేషన్ వేసిన కేశన శంకరరావు ఎన్నిక ఏకగ్రీవమైంది. నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన నేపథ్యంలో ఈనెల 27వ తేదీన బార్ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్నాయి.

దివ్యాంగుల రుణాల కోసం లాటరీ ద్వారా ఎంపిక

మధిరటౌన్, మార్చి23(ఆంధ్రజ్యోతి): రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగ లబ్ధిదారులను లాటరీ ద్వారా ఈ నెల 26, 27 తేదీలలో 1:3 నిష్పత్తిలో ఎంపిక చేయడం జరుగుతుందని సీడీపీవో బాల త్రిపురసుందరి ఒక ప్రకటనలో తెలిపారు. ఓబీఎంఎంఎస్ లాగిన్ నందు అప్లై చేసుకున్న మధిర మండలం రూరల్ కు చెందిన అన్ని గ్రామాల వారికి ఈ నెల 26న మధిర లోని రైతు వేదిక నందు ఉదయం 10 గంటలకు ఎంపీడీవో వెంకటేశ్వర్లు సమక్షంలో ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు తమ ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, ఆన్‌లైన్ అప్లికేషన్ తీసుకొని రావాలని తెలిపారు. అలాగే మధిర మునిసిపాలిటీ పరిధిలో దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు ఈనెల 27న ఉదయం 10 గంటలకు మధిర మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ సంపత్ కుమార్ సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.

నేడు కేఎంసీ ప్రజావాణి రద్దు

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి23(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజావాణి సోమవారం రద్దు చేసినట్లు కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదివారం ప్రకటించారు. వివిధ పనులు కారణంగా కేఎంసీలోని పలువిభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేలో ఉన్నందున ప్రజావాణి రద్దు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు.

కూలీల కొరత..

» ముమ్మరంగా సాగుతున్న మొక్కజొన్న కోతలు
» యంత్రాలను ఆశ్రయిస్తున్న రైతులు



మొక్కజొన్నలను ట్రాక్టర్ ట్రక్కులో పోస్తున్న దృశ్యం

వేంసూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో రోజురోజుకు కూలీల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తుంది. దీంతో రైతులు యంత్రాలవైపు మొగ్గుచూపుతున్నారు. తక్కువ సమయం తక్కువ ఖర్చుతో యంత్రాలను ఉపయోగించి తమ పంటలను కోయిస్తున్నారు. గతంలో గ్రామాల్లో కూలీలు మొక్కజొన్న పంటను కోసేందుకు ఆసక్తి చూపించేవారు. దీంతో రైతులు పలు ప్రాంతాల నుంచి కూలీలను ట్రాక్టర్లు, ఆటోల ద్వారా తీసుకువచ్చి తమ పంటలను కోయించేవారు. ప్రస్తుతం పంటలను కోయించేందుకు కూలీలు అధిక రేట్లు డిమాండ్ చేస్తుండటంతో రైతులు యంత్రాలవైపు మొగ్గు చూపుతున్నారు.

3,200ఎకరాల్లో సాగు...

వేంసూరు మండలంలో రెండోపంటగా 3,200ఎకరాల్లో రైతులు మొక్కజొన్నను జీరోటిల్లేజ్ పద్ధతిలో సాగుచేశారు. మొక్కజొన్న పంట రైతు చేతికొచ్చే సమయం కావడంతో ఇదే అదునుగా భావించి కూలీలు అధిక రేట్లు డిమాండ్ చేస్తుండటంతో రైతులు చేసేదేమీ లేక యంత్రాలతో తమ పంటలను కోయిస్తున్నారు. కూలీలతో ఎకరాకు రూ.పదివేలు ఖర్చవుతుండగా యంత్రంతో కేవలం రూ.ఐదువేలలోపే ఖర్చు అవుతుండటంతో రైతులు యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న క్వింటా ఒక్కింటికి రూ.2,300వరకు ధర ఉంది. అందరి రైతుల మొక్కజొన్న పంటలు కోతకు వచ్చింది. దాంతో యంత్రాల కొరత కూడా రైతులను వేధిస్తుంది. గత సంవత్సరం ఎకరం మొక్కజొన్న 40క్వింటాళ్ల దిగుబడి రాగా ఈ ఏడాది భూగ ర్భజలాలు అడుగంటడంతో 25 నుంచి 35క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు.

కూలీల కొరతతో యంత్రాలను ఉపయోగిస్తున్నాం

● మేడా వెంకటేశ్వరరావు, రైతు, రాయుడుపాలెం



కూలీల కొరత వల్ల యంత్రాలతో మొక్కజొన్నను కోయిస్తున్నాం. గతంలో ఇతర ప్రాంతాలనుంచి ట్రాక్టర్లు, ఆటోల ద్వారా కూలీలను తీసుకువచ్చి పంటను కోయించటం వల్ల అధిక వ్యయం అయ్యేది. ఎకరం పంట కోసినందుకు కూలీలకు రూ.పదివేలు ఖర్చవుతుండగా యంత్రానికి రూ.ఐదువేలు మాత్రమే ఖర్చు కావడంతో యంత్రాల ద్వారానే పంటను కోయిస్తున్నాం. ప్రస్తుతం అందరి రైతుల పంటలు కోతకు వచ్చాయి. దీంతో యంత్రాల కొరత కూడా ఏర్పడింది. తక్కువ ఖర్చు అవుతుండటంతో యంత్రాలతోనే పంటను కోయిస్తున్నాము.

టీడీపీపై కేసీఆర్ వ్యాఖ్యలు సరికావు

» టీడీపీ ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం



సమావేశంలో మాట్లాడుతున్న రామనాథం

మధిర రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో తెలుగుదేశం పార్టీపై అవివేక వ్యాఖ్యలను చేశారని ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని టీడీపీ ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పేర్కొన్నారు. ఆదివారం మధిర టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 45సంవత్సరాల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తెలుగు రాష్ట్రాల ప్రజల మంచి కోసమే పనిచేసిందన్నారు. కేసీఆర్ టీడీపీపై విమర్శలు మానుకోకపోతే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. రాష్ట్ర నాయకుడు చేకూరి శేఖర్‌బాబు, పట్టణ అధ్యక్షుడు మల్లాది హన్మంతరావు, మండల అధ్యక్షుడు మార్నీడి పుల్లారావు, దేవభక్తిని వెంకట్, మేడా వెంకటేశ్వరరావు, మాదల నర్సింహారావు, చట్టు వెంకటేశ్వర్లు, మేడేపల్లి రాణి పాల్గొన్నారు.

పెనుబల్లిలో ఇఫ్తార్ విందు



ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న దయానంద్

పెనుబల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పెనుబల్లిలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌విందులో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాసం ఉంటున్న ముస్లింలతో కలిసి నమాజ్‌లో పాల్గొన్నారు. అనంతరం ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, సోమరాజు సీతారామారావు, షేక్.కరీముల్లా, చీకటి చిన్ననర్సింహారావు, చీకటి రామారావు, షేక్.బాజీ, హుస్సేన్, పొట్లపల్లి వెంకటేశ్వర్లు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తల్లాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం తల్లాడలోని ఆర్‌బీ గార్డెన్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిల ప్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీని నెరవేర్చిందని కొనియాడారు. కార్యక్రమంలో బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, నాయకులు జక్కంపూడి కిషోర్, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, దీవెల కృష్ణయ్య, గోవిందు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయి : సండ్ర



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో మసీద్ లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాజరైన సండ్ర ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు రోజా విడిపించి పండ్లు అందజేశారు. అనంతరం స్థానిక రాజీవ్ నగర్ లోని మసీదులో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మసీద్ సదర్ ముజ్జు రెహమాన్, ఎస్‌కే.చాంద్‌పాషా, ఫయాజ్, జిన్నీ, షైబు, ఉమర్‌అలీ, అబ్దుల్లా, అజార్, షరీఫ్, మునిసిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్, నాయకులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, నడ్డి ఆనందరావు, తడికమళ్ల ప్రకాశరావు, ఆయూబ్‌పాషా, నరుకుళ్ల శ్రీను, అద్దంకి అనిల్, కోట ప్రభాకర్, ఖలీల్ పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

సత్తుపల్లిరూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేజర్లకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు విస్సంపల్లి వెంకటేశ్వరావు ఆదివారం పాముకాటుకు గురవ్వగా సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విస్సంపల్లిని పరామర్శించి ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూసంపూడి మహేష్, చింతల సురేందర్‌రెడ్డి, నంద్యాల వెంకటరెడ్డి, గుర్రాల సురేష్, గుండ్ల వీరభద్రం, నాయుడు శ్రీను, అద్దంకి అనిల్, వేణు, నర్సింహారావు, రఘు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురికి గాయాలు

సత్తుపల్లిరూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణ శివారుల్లో వేర్వేరుగా చోటుచేసుకున్న ప్రమాదాలలో ఇరువురు గాయాలయ్యాయి. కాగా వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆదివారం సత్తుపల్లి నుంచి గంగారం వైపు వెళ్తూ ఫ్లైఓవర్ దిగి యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో బైక్ మొరాయించగా అదే సమయంలో అటువైపు నుంచి సత్తుపల్లికి వస్తున్న ట్యాంకర్ లారీ ప్రమాదవశాత్తూ ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనదారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అదేవిధంగా తల్లాడ మండలం మల్లవరానికి చెందిన అద్దంకి రాము శనివారం రాత్రి మండలంలోని నారాయణపురంలోని తన బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. స్థానిక జ్యోతినిలయం వద్దకు రాగానే కారు, బైక్ ప్రమాదశాత్తూ ఢీకొనగా 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యంకోసం ఖమ్మం తరలించారు. ఈ రెండు ప్రమాదాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ముందస్తు అరెస్ట్



కార్మికులను అరెస్టు చేసిన పోలీసులు

సత్తుపల్లిరూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలుతున్న నేపథ్యంలో మధ్యాహ్న భోజన కార్మికులను సత్తుపల్లి పోలీసులు ఆదివారం ముందుస్తుగా అరెస్ట్ చేశారు. ఇప్పటికే 14నెలలుగా కోడిగుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, 9,10వ తరగతులకు రావాల్సిన మెనూ చార్జీలు కూడా పెండింగ్‌లో ఉండగా, 2003లో ప్రవేశపెట్టిన అల్పాహారం బిల్లులు సైతం రావాల్సి ఉందని కార్మికులు కొత్తపల్లి జరీనా, దరావత్ శ్రీలక్ష్మీ, తెలగారపు కనకదుర్గ, నిమ్మటూరి కృష్ణవేణి, గుంటూరు విజయలక్ష్మీ, కృష్ణమ్మ, కంటేపూడి లక్ష్మీలు వాపోయారు. న్యాయమైన సమస్యల పోరాటానికి వెళ్తున్న తమను అరెస్ట్ చేయడం ప్రజాసామ్యానికి విరుద్ధమన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ

కల్లూరు, మార్చి23 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా కల్లూరులో పేద ముస్లింలకు తోపుడుబండి ఫౌండేషన్ తరుపున ఆదివారం రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోపుడుబండి అధినేత్రి ఉషాసాధిక్ మాట్లాడుతూ సేవ అనేది ఒక మతానికో, సమాజానికో పరిమితం కాదన్నారు. అది మనస్సున్న ప్రతి ఒక్కరి కర్తవ్యమని ఈ సిద్ధాంతాన్ని తోపుడుబండి సంస్థ వ్యవస్థాపకుడు సాదిక్ అలి ఆశయం అని చెప్పారు. సాదిక్ ఆశయాలను కొనసాగించే క్రమంలో నిరుపేద ముస్లింల కుటుంబాలకు రూ.1.50 లక్షల విలువ గల రంజాన్ తోఫాలో నిత్యవసర వస్తువులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో తోపుడుబండి సంస్థ సలహాదారులు దయాల కిషోర్‌దత్, సుజాత, శ్యామాల, అన్నపూర్ణ, రచనశ్రీ, హైసన్ తదితరులున్నారు.



రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్న తోపుడుబండి అధినేత్రి ఉష

‘భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాడాలి’



వైరాలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

వైరా, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జీవితాన్ని ప్రేమిస్తాం...మరణాన్ని ప్రేమిస్తాం... మేము మరణించి ఎర్రపూల వనంలో పూలై పూస్తాం... ఉరి కంభాన్ని ఎగతాళి చేస్తాం... నిప్పురవ్వలమీద నిదిరిస్తామంటూ దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ సామ్రాజ్య వాదులపై తిరుగుబాటు చేసి 23ఏళ్ల అతి పిన్నవయస్సులోనే వరికొయ్యను ముద్దాడిన భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాడుదామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సీపీఎం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వైరాలో భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురుల 94వ వర్ధంతి సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఎం పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో పోతినేని, నున్నా మాట్లాడారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, నాయకులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, చెరుకుమల్లి కుటుంబరావు, బాణాల శ్రీనివాసరావు, మచ్చా మణి, తోట నాగేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, తూము సుధాకర్, గుడిమెట్ల రజిత, కొంగర సుధాకర్, మాగంటి తిరుమలరావు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో...

సత్తుపల్లి: దేశ స్వాతంత్రం కోసం చిన్నవయస్సులోనే ఉరితాడును ముద్దాడిన భగత్‌సింగ్ ఆశయస్ఫూర్తిని యువత కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా స్థానిక మునిసిపల్ కార్యాలయం సమీపంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ చూపిన మార్గం అందరికీ ఆదర్శమని, 200ఏళ్ల దేశాన్ని పాలించిన బ్రిటీష్ వాళ్లను వెళ్లగొట్టి దేశానికి స్వాతంత్రం కోసం తనప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన విప్లవ యోధుడిని జోహార్లు అన్నారు. కార్యక్రమంలో దండు ఆదినారాయణ, గాదె చెన్నారావు, నిమ్మటూరి రామకృష్ణ, తడికమళ్ల యోబు, తదితరులు పాల్గొన్నారు.

మధిరరూరల్‌లో....

మధిర రూరల్: భగత్‌సింగ్ 94వ వర్ధంతిని మధిర పట్టణంతోపాటు మల్లారం గ్రామంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మధిరలో భగత్‌సింగ్ విగ్రహానికి సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి మందా సైదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శీలం నర్సింహారావు, పడకంటి మురళీ, మద్దాల ప్రభాకర్, వూట్ల శంకరయ్య, మందడపు ఉపేంద్ర పాల్గొన్నారు.



ముదిగొండలో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న యువకులు

కారేపల్లిలో...

కారేపల్లి: పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ 94వ వర్ధంతి కార్యక్రమం మండల పరిధిలోని గాంధీనగరంలో నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ విజయ్ పాల్గొని ప్రసంగించారు.

ముదిగొండలో...

ముదిగొండ: దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు భగత్‌సింగ్ అని యువసంఘం నాయకులు పేర్కొన్నారు. భగత్‌సింగ్ 94 వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం ముదిగొండ ప్రధాన సెంటర్ వరకు కాగడాలు, జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతి పిన్నవయస్సులో దేశం కోసం ఉరికొయ్యను ముద్దాడిన భగత్‌సింగ్ జీవితం ఆదర్శమని పేర్కొన్నారు. కార్యంలో బట్టు రాజు, ఇరుకు నాగేశ్వరరావు, సతీష్, రవి, కట్టకూరి సురేష్, సాయి, సుధాకర్, నాగార్జున, వీరబాబు పాల్గొన్నారు.



మధిరలో మాట్లాడుతున్న నాయకులు



కారేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు



సత్తుపల్లిలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దయానంద్

8నుంచి బేతుపల్లి అంకమ్మతల్లి తిరునాళ్లు



అంకమ్మతల్లి ఆలయం

సత్తుపల్లిరూరల్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం బేతుపల్లి గ్రామంలో కొలువైయున్న బేతుపల్లి అంకమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం వచ్చేనెల 8వ తేదీ నుంచి 13వరకు నిర్వహించన్నున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న తిరునాళ్ల ప్రతిఏటా వలే ఈసారి ఘనంగా జరపతలపెట్టామని, గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు వేలాది తరలివచ్చి తిరునాళ్లను తిలకించాలని కోరారు. 8న మైలపట్నంతో ప్రారంభమయ్యే తిరునాళ్ల పుట్టబంగారం, 9న జలబిందెలు, పూలకప్పెర, 10న రెడకప్పెర, 11న గ్రామప్రభబండి ఊరేగింపు, 12న గండదీపాలు, రాత్రి నుంచి పెద్ద తిరునాళ్ళ, తెల్లవారుజామున అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం, 13న బద్దెగొర్రె, చంద్రపట్నం, రాత్రి నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, తిరునాళ్లతో ముగుస్తాయని చెప్పారు. వివరాలకు 9640306054, 9494889899, 9912887821లను సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

13న వైరాలో టీయూసీఐ జిల్లా మహాసభలు

వైరా, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వైరాలోని కామిశెట్టి కల్యాణ మండపంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) జిల్లా ప్రథమ మహాసభలను ఏప్రిల్ 13వతేదీన నిర్వహిస్తామని ఆయూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.వెంకన్న, జి.రామయ్య తెలిపారు. ఈ మహాసభల ఆహ్వానసంఘం గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ కె.మోహన్‌రావు, అధ్యక్షుడిగా ఊరుకొండ శ్రీనివాసరావుతో కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. 300మంది ప్రతినిధులతో ఈ మహాసభలు నిర్వహిస్తామని వెంకన్న, రామయ్య తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు సీవై.పుల్లయ్య, బండారు భద్రయ్య, కుదురుపాక దర్గయ్య, యాకోబు, యలదండి బాబు, లింగారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో నినాదాలు చేస్తున్న నాయకులు